# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :101 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 20-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## డీఎన్ఏ పరీక్ష ద్వారా ఇప్పటి వరకూ 210 మృతదేహాలను గుర్తించాం

అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలి నేటికి వారం రోజులు. ఈ దుర్ఘటనలో 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే, వారం రోజులైనా మృతుల గుర్తింపు ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. డీఎన్ఏ పరీక్ష ద్వారా ఇప్పటి వరకూ 210 మంది బాధితుల వివరాలను గుర్తించినట్లు గుజరాత్ ఆరోగ్య శాఖ మంత్రి రుషికేశ్ పటేల్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు.ఇవాళ ఉదయం 8:30 గంటల వరకూ (19వ తేదీ) 210 మృతదేహాలను డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించినట్లు వెల్లడించారు. అందులో 187 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. మిగతా డెడ్‌బాడీస్ అప్పగింత ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. మరోవైపు మృతదేహాలను గుర్తించడానికి అహ్మదాబాద్‌లో డీఎన్ఏ ప్రయోగశాల 24 గంటలూ పనిచేస్తోంది. ప్రమాదంలో మృతదేహాలు గుర్తించలేనంత తీవ్రంగా కాలిపోవడంతో ఎముకల్లోని కణజాలాన్ని సేకరించి డీఎన్ఏ పరీక్షలు చేయాల్సి వస్తున్నదని.. అందుకే మృతదేహాల గుర్తింపు ఆలస్యమవుతున్నదని వైద్యులు తెలిపారు.

# ఇరాన్ దెబ్బ అదుర్స్.. ఇజ్రాయెల్‌కు భారీ ఎదురుదెబ్బ



టెహ్రాన్/టెలీ అవీవ్: ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం నడుస్తోంది. రెండు వైపుల నుంచి బాంబు దాడులు పీక్ స్టేజ్ చేరుకున్నాయి. ఇజ్రాయెల్‌పూ ఇరాన్ దళాలు విరుచుకుపడుతున్నాయి. ఇరాన్ ప్రయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణుల కారణంగా ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ ధ్వంసమైంది. ఇజ్రాయెల్‌లోని ఆసుపత్రులు, స్కూల్స్, నివాస ప్రాంతాల్లోకి ఇరాన్ క్షిపణులు దూసుకెళ్లాయి. దీంతో, భారీగా ప్రాణ నష్టం జరిగినట్టు తెలుస్తోంది.తాజాగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు ఇజ్రాయెల్‌లోని పలు నగరాల్లో బీభత్సం సృష్టించాయి. టెలీ అవీవ్, రామత్‌గాన్, హెూలోన్, బెర్షీబా నగరాలపై ఇరాన్ విరుచుకుపడింది. దీంతో, భయానక వాతావరణం నెలకొంది. బీర్షెబాలోని సోరోకా ఆసుప్రతిపై ఇరాన్ దాడి చేయడంతో భవనం పూర్తిగా దెబ్బతింది. అనంతరం, ఆసుపత్రిలో ఉన్న పేషంట్స్, వైద్యులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. ఈ దాడిలో పలువురు గాయపడ్డారు. అత్యవసర బృందాలు స్పందించడంతో వారంతా ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలు వైరల్‌గా మారాయి.మరోవైపు.. ఇజ్రాయెల్‌లోని హెూలోన్ ప్రాంతంలో నివాసాలపై ఇరాన్ దాడులకు తెగబడింది. ఈ క్రమంలో పలువురు పౌరులు తీవ్రంగా గాయపడ్డారని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ నివేదించింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని ప్రధాన, అతిపెద్ద ఆసుపత్రిపై ఇరాన్ దాడులు చేయడంతో భారీ నష్టం జరిగిందని చెప్పుకొచ్చింది. ఇజ్రాయోల్ రాజధాని టెలి అవీవ్‌లోని బహుళ అంతస్తు భవనాలపై క్షిపణి దాడులు జరగడంతో అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. అంతకుముందు.. ఇరాన్ సైనిక సామర్థ్యం అణ్వస్త్ర స్థాయికి చేరకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా దాడులతో దండయాత్ర చేస్తున్న ఇజ్రాయెల్ బుధవారం తన బాంబుల కుంభవృష్టిని కురిపించింది. ఇరాన్‌లోని 40 కీలక ప్రాంతాలపై క్షిపణులతో విరుచుకుపడింది. యురేనియం శుద్ధి ప్రక్రియలో కీలకమైన సెంట్రీఫ్యూజ్‌లను తయారుచేసే కర్మాగారంపై భీకరస్థాయిలో మిస్సైళ్లను ప్రయోగించింది. ఇరాన్ సాయుధశక్తిని నిర్వీర్యం చేసేందుకు క్షిపణుల ఉత్పత్తి ఆయుధ ప్లాంట్‌లపైనా ఇజ్రాయెల్ వందల కొద్దీ డ్రోన్లను ఎక్కుపెట్టింది.ఇరాన్ అంతర్గత భద్రత శాఖ ప్రధాన కార్యాలయంపైనా యుద్ధవిమానాలు దాడులు చేశాయి. ప్రతిగా ఇరాన్ సైతం ఇజ్రాయెల్ భూభాగాలపై క్షిపణులను పేలుస్తూ విధ్వంసం సృష్టిస్తోంది. ఇరాన్ జరిపిన ప్రతిదాడుల్లో ఇప్పటిదాకా 24 మంది చనిపోయారు. బుధవారం తమవైపు దూసుకొచ్చిన 10 క్షిపణులను నేలకూల్చామని ఇజ్రాయెల్ పేర్కొంది. జవాదాబాద్‌లో అత్యాధునిక ఎఫ్–35 యుద్ధవిమానాన్ని ఇరాన్ సేనలు పేల్చేశాయి. దాదాపు రూ.140 కోట్ల విలువైన హెర్మెస్ డ్రోన్‌నూ నేలకూల్చాయి. అత్యంత శక్తివంతమైన ఫతాహ్ హైపర్‌సోనిక్ క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రకటించింది. అయితే తమదేశంలో శుక్రవారం నుంచి ఇప్పటిదాకా 15,871 చోట్ల నిర్మాణాలు, దాదాపు 1,300 వాహనాలు, 1,633 ఆస్తులు నాశనమయ్యాయని ఇజ్రాయెల్ బుధవారం ఒప్పుకుంది.

ఇరాన్‌లో భయానక నిశ్శబ్దం

ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ చాలా వరకు ధ్వంసంకావడంతో ఎప్పుడు ఎటు నుంచి ఇజ్రాయెల్ క్షిపణులు మీదొచ్చి పడతాయోనన్న భయాలు ఇరాన్ ప్రజల్లో కనిపించాయి. చాలా నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, ఆఫీస్‌లు, స్కూళ్లు, కాలేజీలు మూతబడ్డాయి. సురక్షిత ప్రాంతాలకు నిత్యావసర సామగ్రితో వలసవెళ్లే వాళ్లు తప్పితే రోడ్లపై ఇంకెవరూ కనిపించట్లేదు. ఇజ్రాయెల్‌లో కాస్తంత భిన్నమైన వాతావరణం కన్పించింది. ఇరాన్‌ను సుదూరంగా ఉన్న ఇజ్రాయెల్ పట్టణాల్లో పౌరసంచారాన్ని స్థానిక యంత్రాంగం అనుమతించింది. " మా ఆర్థికవ్యవస్థ మళ్లీ పుంజుకోవడమే ఇరాన్‌పై విజయానికి ప్రబల నిదర్శనం" అని ఇజ్రాయెల్ రక్షణమంత్రి 'ఇజ్రాయెల్ కట్జ్' అన్నారు. ఆపరేషన్ రైజింగ్ లయన్ లక్ష్యంగా నెరవేరేదాకా ఇరాన్‌తో ఎలాంటి చర్చలు జరపబోమని స్పష్టం చేశారు.

# ఇక 15 రోజులలోనే ఓటరు ఐడి కార్డు...




న్యూఢిల్లీ : ఓటర్ గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై దరఖాస్తు చేసుకున్న వారికి కేవలం 15 రోజుల్లోనే ఓటర్ ఐడీ కార్డులను అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొత్త కార్డు లేదా మార్పులు చేర్పులు చేసిన కార్డు పొందడానికి నెల రోజులకు పైగా సమయం పడుతుండగా, ఈ నూతన విధానంతో ఆ జాప్యం తగ్గనుంది.ఈ కొత్త విధానం ప్రకారం, కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న వారికి, అలాగే తమ ఓటర్ కార్డులోని వివరాలలో మార్పులు కోరిన వారికి ఇది వర్తిస్తుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కార్డు తయారీ నుంచి ఓటరు చేతికి అందే వరకు ప్రతి దశను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ) స్థాయి నుంచి పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేసేంత వరకు రియల్–టైమ్ ట్రాకింగ్ చేయనున్నట్లు పోల్ అథారిటీ తెలిపింది. అంతేకాకుండా, కార్డు ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ద్వారా ఓటర్లకు తెలియజేయనున్నారు.త్వరలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ లేదా నవంబర్ నెలల్లో ఈ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అలాగే, వచ్చే ఏడాది తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఓటర్లకు సత్వర సేవలు అందించేందుకు ఎన్నికల సంఘం ఈ దిశగా కసరత్తు చేపట్టింది.

# తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం..



హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టేందుకే ఎక్కువ ప్రయత్నం చేస్తున్నది అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. బనకచెర్ల ద్వారా ఆంధ్రాకు సాగునీటిని తరలించుకు పోయే ప్రయత్నాలకు ఈ ప్రభుత్వం సహకరిస్తుంది అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించిన తర్వాతనే ఈ ప్రభుత్వం బనకచెర్ల విషయంలో స్పందించింది. అఖిలపక్ష సమావేశంలో రాజకీయాలు మాట్లాడడంతో పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆయన సమావేశం నుండి బయటకు వచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అయిన వద్దిరాజును కించపరిచినట్లు రేవంత్ రెడ్డి మాట్లాడారు. సీఎంకు ఈ విషయంలో ఏదో పాండిత్యం ఉన్నట్లు మాట్లాడారు. బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఏదో సాధించినట్లు వారిని పొగిడారు అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు.

సీఎం రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యానికి నిదర్శనం..

కేంద్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఒప్పందంగా చిత్రీకరించడం సీఎం రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యానికి నిదర్శనం.. సమావేశంలో ఎవరు ఏం మాట్లాడినా రికార్డ్ చేస్తారన్న విషయం తెలియకపోవడం విడ్డూరం. మొత్తం సమావేశంలో బనకచర్లను ఖచ్చితంగా అడ్డుకుని తీరతాం అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి ఎందుకు చెప్పడం లేదు..? పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.32,500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఖర్చు చేసింది.. ఇక్కడ కేవలం 172 ఎకరాలు మాత్రమే సేకరించాల్సి ఉంది.. ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తయ్యాయి. పాలమూరు కరువును శాశ్వతంగా రూపుమాపే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. మిగిలిన పనులు పూర్తి చేసి వెంటనే నీటి కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని పట్టించుకోవడం లేదు అని నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

ముఖ్యమంత్రి హెూదాకు అది తగదు..

రేవంత్ మాట్లాడే భాష ఆయనకు అందంగా అనిపించవచ్చు.. కానీ ముఖ్యమంత్రి హెూదాకు అది తగదు.. మీరు మాట్లాడే భాష మీ వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. కృష్ణా నీళ్ల విషయంలో తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది.. తెలంగాణ పోరాటమే నీళ్ల కోసం జరిగింది.. ఏపీలో కేవలం తెలుగుగంగకు మాత్రమే నీటి కేటాయింపు ఉంది.. కానీ ఆంధ్రాలో 300 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మించుకున్నారు.. ప్రస్తుతం కృష్ణా నదిలో తగినంత నీరు అందుబాటులో లేదు. కృష్ణా బేసిన్‌కు కాళేశ్వరం ద్వారా సాగునీటిని తరలించాలన్న ఆలోచన కేసీఆర్‌కు ఉన్నది. తెలంగాణ ప్రయోజనాలు, ఇక్కడి అవసరాలు తీరిన తర్వాత మిగిలిన ప్రాంతాలకు సాగునీరు ఇస్తామని కేసీఆర్ అన్నారు.. దీనికి నిన్న, నేడు, రేపు ఎప్పటికి కట్టుబడి ఉంటాం అని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

కేసీఆర్ లేకుంటే, తెలంగాణ తేకుంటే రేవంత్ రెడ్డి ఎక్కడ..?

కేసీఆర్ లేకుంటే, తెలంగాణ తేకుంటే రేవంత్ రెడ్డి ఎక్కడ ఉండేవాడు.. ప్రతి అంశంలో తెలంగాణను కించపరిచి, తెలంగాణను అవహేళన చేసి మాట్లాడడం తగదు.. ఇదొక మానసిక రుగ్మత అనిపిస్తుంది. అఖిలపక్షంలో ప్రతిపక్ష పార్టీలను ఎందుకు పిలుస్తారు? ప్రభుత్వ ఉద్దేశం ఏంటో చెప్పాలి.. కానీ అధికారుల ముందు రాజకీయాలు ఎలా మ్టాట్లాడతారు? బనకచెర్ల ప్రాజెక్టు నేపథ్యంలో నాగార్జున సాగర్ కాలువలను వెడల్పు చేస్తున్నది.. ఇది రాష్ట్ర విభజన చట్టానికి వ్యతిరేకం.. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా నిలదీయడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా సాగునీటి పంపకాలు, ప్రాజెక్టుల గురించి అపెక్స్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కోరడం లేదు? అపెక్స్ సమావేశం ఏర్పాటు చేయకుంటే ప్రాజెక్టులకు అనుమతులు ఎలా వస్తాయి?

# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులివ్వొద్దు

న్యూఢిల్లీ, గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులివ్వొద్దని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి బృందం కేంద్ర మంత్రితో భేటీ అయ్యారురు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి–బనచర్ల ప్రాజెక్ట్‌పై అభ్యంతరాలను సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మరో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సీఆర్ పాటిల్‌కు వివరించారు. ఆ ప్రాజెక్ట్ తెలంగాణ హక్కులకు, ముఖ్యంగా గోదావరి నది జలాలపై హక్కులకు భంగం కలిగిస్తుందని తెలిపారు.

తెలంగాణకు నీటి లభ్యత తగ్గుతుంది

గోదావరి నీటిని ఏపీకి ఏకపక్షంగా మళ్లించడం వల్ల తెలంగాణకు నీటి లభ్యత తగ్గుతుందని, ఇది రాష్ట్రంలోని వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీఎం బృందం పేర్కొంది. ఇక భద్రాచలం, మణుగూరు వంటి ప్రాంతాల్లో ముంపు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని విన్నవించారు. గోదావరి –బనకచర్ల ప్రాజెక్ట్‌తో ఏపీ ప్రభుత్వం గోదావరి నది జల వివాదాల ట్రైబ్యునల్ అవార్డు తోపాటు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం (2014)ను చంద్రబాబు ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. తమకు కనీస సమాచారం లేకుండానే.. ప్రాజెక్ట్‌కు సంబంధించి డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి పంపారని ఎట్టి పరిస్థితుల్లో పోలవరం – బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని సీఎం రేవంత్ బృందం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కొరినట్లుగా సమాచారం.



కేంద్ర మంత్రి వద్ద అభ్యంతరాలు చెప్పాం : మంత్రి ఉత్తమ్

సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గోదావరి–బనకచర్ల ప్రాజెక్ట్‌పై తమ అభ్యంతరాలను కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు వివరించామని అన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తిగా ఏపీ పునర్విభజన చట్టానికి వ్యతిరేకమని తెలిపామని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి పాటిల్ కూడా తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారని వివరించారు. అదేవిధంగా బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఇంకా పూర్తి డీపీఆర్ రాలేదని చెప్పారని తెలిపారు. తమకు కృష్ణా, గోదావరి జలాల్లో 1500 టీఎంసీలకు ఎన్‌వోసీ ఇస్తేనే.. గోదావరి– బనకచర్ల ప్రాజెక్టుకు అభ్యంతరం లేదని కేంద్ర మంత్రికి చెప్పామని అన్నారు. ఏపీ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు వస్తున్నాయని.. తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం వేగం కనిపించడం లేదని కామెంట్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణకు అన్యాయం చేయబోమని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు.. ఇప్పటివరకు స్పందించని మిత్ర దేశాలు



టెహ్రాన్:ఇరాన్‌పై గత వారం రోజులుగా ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. అణు కేంద్రాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఇరాన్ కీలక కమాండర్ల సహా 14 మంది అణు శాస్త్రవేత్తలు చనిపోయారు.తాజాగా అగ్ర రాజ్యం అమెరికా కూడా రంగంలోకి దిగుతోంది. ఇంత జరుగుతున్నా ఇరాన్ మిత్ర దేశాలు ఇప్పటి వరకు స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.బాగ్దాద్ నుంచి బీరూట్ వరకు ఇప్పటి వరకు ఫోన్ చేయకపోవడం ఇరాన్ నేతలు నిర్ఘాంతపోతున్నారు. లెబనాన్‌లో హిజ్బుల్లా, పాలస్తీనాలో హమాస్, యెమెన్‌లో హౌతీలు, ఇరాక్‌లో షియా మిలీషియాలు కూడా స్పందించలేదు. ఇంకోవైపు అమెరికా కూడా రంగంలోకి దిగుతుంటే.. కనీసం ఖండించిన పాపాన పోలేదు.నాలుగు దశాబ్దాలకు పైగా ఇరాన్ పశ్చిమాసియాలో ప్రాక్సీ శక్తుల కూటమిని నిర్మించింది. అమెరికా, ఇజ్రాయెల్ ప్రభావాన్ని తిప్పికొట్టడానికి ఈ శక్తిని ఇరాన్ ఏర్పాటు చేసింది. ప్రత్యక్ష ఘర్షణ నుంచి తనను తాను రక్షించుకోవడానికి ఈ కూటమిని ఏర్పాటు చేసింది. కానీ ఇప్పుడు ప్రాక్సీలు నిశ్శబ్దంగా ఉన్నాయి. వారం రోజులుగా ఇజ్రాయెల్ యుద్ధం చేస్తున్నా.. కనీసం ఫోన్ చేసిన దాఖలే లేవు. మిత్ర దేశాల నుంచి స్పందన లేకపోవడంతో ప్రస్తుతం ఇరాన్ ఒక్కటే ఒంటరిగానే పోరాడుతోంది. ఇక భారతదేశం కూడా మిత్ర దేశంగా ఉంది. పదేళ్ల పాటు ఇరాన్‌తో సంబంధాలు పెట్టుకుంది. ప్రస్తుతం భారత్ కూడా స్పందించలేదు. ఇజ్రాయెల్ దాడులను ఖండించలేదు. కారణం.. రెండు దేశాలతోనూ భారత్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే భారత్ మౌనంగా ఉంది.

# బంజారా పీఠాధిపతులకు ప్రాధాన్యత ఇవ్వండి

హైదరాబాద్, తిరుపతి హతిరామ్ బావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలని టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడును తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వివిధ బంజారా పీఠాధిపతులతో కలిసి గురువారం హైదరాబాద్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును ఎమ్మెల్సీ కవిత మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 30న హతిరామ్ బావాజీ జయంతి సందర్భంగా బంజారా (సుగాలి, లంబాడీ) పీఠాధిపతులు, పూజారులకు మఠంలో ప్రత్యేకంగా పూజలు చేసే అవకాశం కల్పించడంతో పాటు నైవేద్యం సమర్పించడానికి ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

త్వరలో బంజరా పీఠాధిపతులతో సమావేశం

త్వరలోనే హతిరామ్ బావాజీ పీఠం నిర్వాహకులు, గిరిజన పీఠాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హామీ ఇచ్చారు.



హతిరామ్ బావాజీ మఠంలో పూజలు చేయడానికి, హారతి ఇవ్వడానికి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. 30న హతిరామ్ బావాజీ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడానికి, నైవేద్యం సమర్పించడానికి అవకాశం కల్పిస్తామని టీటీడీ చైర్మన్ హామీ ఇచ్చారు.

# జగన్ వ్యాఖ్యలపై నవ్వుకుంటున్నారు..



అమరావతి,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభి రామ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శవ రాజకీయాల కోసం వచ్చి, ఇద్దరిని శవాలుగా మార్చారు జగన్ అంటూ మండిపడ్డారు. 'జగన్ నువ్వు చేసిన ఆరోపణలు నిజమని నీ కుటుంబమే నమ్మదు.. నీ వైసీపీ క్యాడర్ కూడా నమ్మదు. ప్రజలు నవ్వుకుంటున్నారు..' అంటూ ఎద్దేవా చేశారు. ఏపీ రాజకీయాలలో జగన్ ఒంటరిగా మిగిపోతారని... బూతుల మంత్రులు కూడా మిగలరన్నారు. చంపడం, పరామర్శించడం జగన్‌కు అలవాటు.. అదే ఇష్టం కూడాను అంటూ వ్యాఖ్యలు చేశారు. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకుంటే, ఆ పాపం టీడీపీపై వేస్తున్నారన్నారు. ఏడాది క్రితం చనిపోతే ఇప్పుడు పరామర్శకు వెళ్లడమే పెద్ద నాటకమన్నారు.జగన్ పర్యటనలో ఫ్లెక్సీలు రెచ్చగొట్టే విధంగా, విపరీత నేరపూరిత ధోరణితో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ అయినా అధికారంలో లేకపోతే ఇంతలా బహిరంగంగా నరుకుతాం.. చంపుతాం.. తొక్కిపడేస్తాం.. అని జనాల్ని బెదిరిస్తారా అని ప్రశ్నించారు. 'ప్రజలకు ఏం సందేశం ఇద్దామని జగన్.. నీ ప్రమాదం నుంచి జనాల్ని చైతన్య పరచాలి.. లేకుంటే నష్టపోతాం. వైసీపీ అనే ఒక రాజకీయ పార్టీ ముసుగులో ఉన్న అంతర్గత తీవ్రవాద వ్యవస్థ నీది. 2019–24 జగన్ పాలనా సమయంలో గంజాయి, డ్రగ్స్, నాసిరకమైన మద్యం, హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులు, సోషల్ మీడియాలో బూతులు, స్త్రీ లపై దాడులు వంటివి చేసి, ఒక తరం భవిష్యత్ పొట్టన పెట్టుకున్నాడు. ర్యాలీలో వాహనం ఢీకొని ఒకరు, తోపులాటలో ఇంకొకరు వైసీపీ కార్యకర్తలు చనిపోతే కనీసం పట్టించుకోలేదు.. అంటే ఇంకొక సారి పరామర్శకు సాకు దొరుకుతుందనా. శవ రాజకీయాలు చేయడం, రాజకీయ ముసుగులో కుట్రలకు పాల్పడం జగన్‌కు బాగా అలవాటే' అంటూ విమర్శలు గుప్పించారు.అంతర్జాతీయ యోగా వేడుకల సమయంలో రాష్ట్రంలో అలజడి సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు జగన్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. జగన్ స్వార్థ రాజకీయానికి రెండు నిండు ప్రాణాలు బలైపోయినా స్పందించలేదన్నారు. ఖాళీ అవుతున్న వైసీపీ పార్టీని కాపాడుకునేందుకు జగన్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పరామర్శలు ప్రజల కోసమే అయితే..

## సంపాదకీయం

శుక్రవారం 20-06-2025

# శాంతియుత పరిష్కారం

అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఏకపక్షంగా ఇరాన్‌పై దాడులు చేయడం దుర్మార్గం, గర్హనీయం. నెతన్యాహు సర్కారు గాజాలో మొదలుపెట్టిన నరమేధాన్ని క్రమంగా విస్తరిస్తూ పశ్చిమాసియాను అగ్నిగుండంగా మార్చేసింది. యుద్ధాలను ఆపేస్తానంటూ గద్దెనెక్కిన ట్రంప్ వాటికి మరింతగా ఆజ్యం పోస్తూ ప్రపంచానికే పెనుముప్పుగా పరిణమిస్తున్న విధ్వంసాలకు మద్దతుగా నిలవడం గర్హనీయం. అమెరికాను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి ట్రంప్ అనుసరించిన సుంకాల యుద్ధం స్వదేశంలోనే వ్యతిరేకతను తెచ్చిపెట్టింది. ఉక్రెయిన్ యుద్ధం ఆపానన్న ప్రకటనలు ఆచరణ రూపం దాల్చలేదు. ఈ పరిస్థితుల్లో నెతన్యాహు భుజాలపై నుంచి ఇరాన్‌తో యుద్ధం చేస్తున్నాడు. ఐదు రోజుల క్రితం ఆకస్మికంగా దాడి చేసి తాజా ఉద్రిక్తతలకు నాంది పలికిన ఇజ్రాయిల్ అణ్వస్త్రాల తయారీకి ఇరాన్ చేరువలో ఉన్నందున ఆ ప్రయత్నాలను అడ్డుకోవడం, ఇరాన్ సుప్రీం నేత, మత పెద్ద ఖమేనీ కనుసన్నల్లోని ప్రభుత్వాన్ని పడగొట్టడం లక్ష్యాలుగా దాడులు చేసినట్టు నెతన్యాహు ప్రకటించుకున్నారు. ఆకస్మిక దాడులతో ఇరాన్ కీలక ఆర్మీ కమాండర్లను కోల్పోయింది. అణుకేంద్రాన్ని, దక్షిణ ఇరాన్‌లోని ప్రపంచంలోనే అతి పెద్ద సహజవాయు క్షేత్రాన్ని, టెహ్రాన్ వెలుపల చమురు డిపోను ఇజ్రాయిల్ సైన్యం పేల్చివేసింది. ఇరాన్ ప్రతిదాడులు చేయడంతో టెల్ అవీవ్ కూడా వణికిపోతోంది. రెండు దేశాల రాజధానుల్లోని పౌరులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ మొసాద్ కార్యాలయం సైతం ఆహుతైంది. అమెరికా, ఇజ్రాయిల్‌లు ప్రచారం చేసుకున్న ఐరన్ డోమ్ రక్షణ ఉన్నా టెల్ అవీవ్ కకావికలం కావడం గమనార్హం. జి-7 సదస్సు నుంచి హుటాహుటిన వాషింగ్టన్‌కు ట్రంప్ వెళ్లిపోవడం, టెహ్రాన్‌ను ఖాళీ చేయాలంటూ ట్రంప్, ఇజ్రాయిల్ హెచ్చరించడం ఏ పరిణామాలకు దారితీస్తుందో చూడాలి. నెతన్యాహు వాదన అబద్ధమనడానికి అణుబాంబు తయారీకి దరిదాపుల్లో కూడా ఇరాన్ లేదని సాక్షాత్తు అమెరికా ఇంటెలి జెన్స్ చీఫ్ కొన్ని వారాల క్రితమే ప్రకటించడం రుజువు. ఏ దేశంలోనైనా పాలకులను నిర్ణయించుకునేది ఆ దేశ ప్రజలే. ఒక దేశంలో ప్రభుత్వాలను మార్చాలని మరో దేశం ప్రయత్నిం చడం ఆ దేశ సార్వభౌమత్వంపై, అంతర్జాతీయ న్యాయ సూత్రా లపై దాడే. ఇరాక్‌లో రసాయన ఆయుధాలు న్నాయం టూ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు అమెరికా పన్నిన కుయుక్తులు అందరికీ తెలిసినవే. ఇప్పుడు ట్రంప్ వత్తాసుతో ఇజ్రాయిల్ చేస్తున్నదీ అదే. యుద్ధం ఆగితే.. గద్దె దిగి.. యుద్ధ నేరాలను ఎదుర్కొనే స్థితిలో ఉన్న నెతన్యాహు సాగిస్తున్న దమనకాండ అత్యంత గర్హనీయం. హమాస్ పేరుతో గాజాపై, హౌతీల పేరుతో యెమెన్‌పై విరుచుకుపడి, పాలస్తీనాలో 55 వేల మందికిపైగా అందునా చిన్నారులు, మహిళలను ఊచకోత కోసిన ఇజ్రాయిల్ పాపాలు చరిత్రలో ఎప్పటికీ చెరగని చీకటి అధ్యాయానికి గుర్తుగా నిలిచిపోయేవే. చమురుపై ఆధిపత్యం కోసం, పశ్చిమాసియాపై పట్టుకోసం ఇజ్రాయిల్ నరమేధాన్ని ప్రోత్సహిస్తున్న అమెరికాతోపాటు పశ్చిమ దేశాల పాపం కూడా చిరకాలం నిలిచిపోయేదే. గతంలో ఇరాన్‌తో ఒబామా కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేసి సమస్యకు కారణమయ్యిందీ, యుద్ధాల నుంచి ప్రపంచాన్ని విముక్తి చేస్తానంటూ బీరాలు పలికిందీ ట్రంపే. ఇజ్రాయిల్‌కు వత్తాసు పలుకుతూఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేస్తుండటంపై సగటు అమెరికన్లతోపాటు స్వపక్షంలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికాతో అణుచర్చలు సాగుతున్న సమయంలో రెండు రోజుల్లో ఆరోదఫా కీలక చర్చలతో సమస్యకు పరిష్కారమవుతుందని ఆశిస్తున్న వేళ ఇజ్రాయిల్ చేపట్టిన దాడులు ప్రపంచ శాంతికి భంగకరం. పర్షియన్ గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై దాడులు, హార్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ఒమన్ గల్ఫ్‌లోని ట్యాంకర్లను లక్ష్యం చేసుకోవడం ద్వారా ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటే భద్రతతోపాటు ప్రపంచాన్ని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసేదే. ఈ పరిణామాలతో పెట్రో ధరలు 40 శాతం పెరగొచ్చని అంచనా. 80 శాతం దిగుమతులపై ఆధారపడిన భారత్ ఆర్థిక వ్యవస్థకూ అశనిపాతమే! తన రాజకీయ అవసరాల కోసం ప్రపంచ శాంతిని పణంగా పెట్టిన నెతన్యాహును, చిరకాల మిత్రదేశమైన ఇరాన్‌నూ ఒకే గాటన కట్టడం ఎంతమాత్రం 'విశ్వగురు'కు తగదు. ఇండియా, పాక్ యుద్ధాన్ని ఆపేశానంటూ తాజాగా మరోసారి చెప్పుకున్న ట్రంప్ వ్యాఖ్యల ను పార్లమెంట్ సాక్షిగా ఖండించాల్సిన ప్రధాని అమెరికా తొత్తులా మూగనోము పట్టడం సిగ్గుచేటు. ప్రపంచ శాంతికి పెనుముప్పుగా మారిన ఇజ్రాయిల్ వైఖరిని అన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టి, సంబంధాలను తెగతెంపులు చేసుకోవడంతోపాటు ప్రపంచ దేశాలతో కలిసి ఒత్తిడి చేయడం ద్వారా టెహ్రాన్ టెల్ అవీవ్‌ల మధ్య మంటలను ఆర్పి, శాంతియుత పరిష్కారం కనుగొనడంలో భాగస్వామిగా మారడం భారత్ ప్రయోజనాలకు తక్షణ అవసరం.

# వలసలే వర్తమాన వాస్తవం



న్యూఢిల్లీ,ఆకలి నుంచి, అగడ్తల నుంచి, వేధింపుల నుంచి, ఘర్షణల నుంచి, మృత్యువు నుంచి సుదూరంగా వెళ్లిపోవడానికీ, సురక్షితంగా బతకడానికీ సాధారణ ప్రజానీకం చేస్తున్న ప్రయత్నాలు ప్రపంచంలో అంతకంతకూ ఎక్కువవు తున్నాయి. ప్రతి దేశంలోనూ జాతీయవాద ధోరణులు పెరిగి, మెజారిటీ వాదం ముదిరి సరిహద్దులు మూసుకుపోతున్నా బతుకుపోరులో పరాజితులవుతున్న సాధారణ జనం ఎప్పటిలా 'వలస గీతం' పాడుతూనే ఉన్నారు. నిరుడంతా ఒక దేశం నుంచి మరో దేశానికి కోట్లాదిమంది ప్రజానీకం వలసపోయారని లాన్సెట్ నివేదిక ప్రకటించింది. ఒక్క మాటలో%-% ప్రతి ఎనిమిది మందిలో ఒకరు స్వస్థలాలను వదిలిపోతున్నారు. ఒక్కో దేశంలో ఒక్కో సమస్య. నియంత పోకడలతో ఉండే పాలకులు కావొచ్చు... సాయుధ ముఠాల బెదిరింపుల వల్ల కావొచ్చు, కళ్లముందు జరుగుతున్న ఘర్షణలు ముదిరి తమను కూడా కబళిస్తాయన్న భయం కావొచ్చు ఎందరెందరో సురక్షిత ప్రదేశాలను అన్వేషిస్తూ తెలియని తీరాలకు పయనమవుతున్నారు. వీటికి తోడు ఈ 21వ శతాబ్దంలో వాతావరణ మార్పుల కారణంగా వచ్చిపడుతున్న సమస్యలు కూడా వలసలను పెంచుతున్నాయని లాన్సెట్ నివేదిక సూచిస్తోంది. భారీ ఆనకట్టల నిర్మాణం, మైనింగ్, పరిశ్రమల స్థాపన వంటి వాటికి అభివృద్ధి పేరిట అనుమతులిస్తున్నారు. ప్రభుత్వాలు నామమాత్రంగా ఇచ్చే పరిహారం ఏ మూలకూ చాలక, చేసేందుకు పనులేమీ లేక వలసలు తప్పటం లేదు. ఇలాంటి 'అభివృద్ధి' పర్యవసానంగా కరువు, వరదలు, ఇతరేతర ప్రకృతి వైపరీత్యాలు కాటేస్తు న్నాయి. ఆహారం, మంచినీరు సంగతలా ఉంచి కనీసం తలదాచుకోవటానికి కూడా ఏమీ మిగలక పోవటం సమస్యాత్మకం అవుతోంది. ఇలాంటివారిని స్వదేశంలోనే సంశయంతో చూస్తారు. తమ వనరులు కాజేస్తారని, జీవికకు ముప్పు తెస్తారని ఆందోళన పడతారు. పరాయి దేశాలకు పోతే చెప్పేదేముంది? మన దేశం వరకూ చూస్తే వలసల్లో దాదాపు 99 శాతం అంతర్గతమైనవేనన్నది నిపుణుల మాట. ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వలసలు అధికంగా ఉంటుండగా, వారికి ఆశ్రయమిచ్చే రాష్ట్రాల్లో ఢిల్లీ, మహారాష్ట్రలది అగ్రస్థానం. వలసపోయే వారిలో ఇతరేతర సమస్యలకు తోడు ఆరోగ్య సమస్యలు కూడా తక్కువేమీ కాదు. ఎండనక, వాననక, తిండితిప్పలు లేక గత్యంతరం లేక కాలినడకన వెళ్లేవారుంటారు. ఎగిసిపడు తున్న అలలు కలవరపరుస్తున్నా, ఏ క్షణమైనా మింగేస్తాయన్న భయాందోళనలున్నా నాటుపడవ లపై సముద్రాలను దాటాలని చూసేవారూ ఉంటున్నారు. ఇలాంటివారంతా వ్యాధుల బారినపడి ఆదరించేవారు లేక, వైద్యసాయం అందక మృత్యుముఖంలోకి పోతున్నారు. తొలుత 2008లో, ఆ తర్వాత 2017లో ఐక్యరాజ్యసమితి ఈ సమస్యపై తీర్మానాలు చేసింది. ప్రత్యేకించి వలసదారుల ఆరోగ్యావసరాలను చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సభ్యదేశాలకు సూచించింది. అయిదేళ్ల క్రితం ప్రపంచ ఆరోగ్యసంస్థ ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. కానీ ఆ సంస్థలో దీనిపై శ్రద్ధపెట్టి పనిచేసే విభాగాలు ఆర్థిక సమస్యలతో మూతబడ్డాయి. వలసదారుల్ని చూసి భయపడే సాధారణ ప్రజానీకం, దీన్ని తమకనుకూలంగా మార్చుకుని అధికారం అందుకోవాలనుకునే రాజకీయ పక్షాల నాయకులు సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో వలసదారుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన చర్యలు కూడా ఉన్నాయి. కానీ పట్టించుకునే వారేరి? సక్రమంగా ఆలోచించి వినియోగించుకుంటే వలసదారులు ఏ సమాజాభివృద్ధికైనా తోడ్పడతారు. చాలా రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే నిర్మాణరంగ, వ్యవసాయరంగ కార్మికులకు పనులు లభిస్తున్నాయి. కానీ వారి యోగక్షేమాలు పట్టక పోవటం, వారి నైపుణ్యాభివృద్ధికి అవసరమైన పథకాలు లేకపోవటం సమస్యలకు దారి తీస్తోంది. దురదృష్టవశాత్తూ హింసనుంచీ, వేధింపులనుంచీ తప్పించుకుని వస్తున్న వలసదారుల్ని అనుమాన దృక్కులతో చూసే వైఖరి పెరుగుతోంది. ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించిన మొదట్లోనే ప్రపంచ మానవ హక్కుల డిక్లరేషన్ వెలువరించింది. దానికి అనుగుణంగా 1951లో శరణార్థుల ఒడంబడిక అమల్లోకొచ్చింది. మన దేశంతోపాటు ఇండొనేసియా, క్యూబా, ఎరిత్రియా, లిబియా వంటి దేశాలు దానిపై సంతకం చేయలేదు. అలా సంతకం చేయకపోయినా శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ వంటి దేశాలనుంచి వచ్చిన శరణార్థులను భారత్ ఆదుకుంది. టిబెట్ నుంచి వచ్చిన 80,000 మంది గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. కానీ ఆ ఒడంబడికను గుర్తించి సంతకం చేస్తే దానికింద శరణార్థులకు కల్పించాల్సిన తప్పనిసరి సదుపాయాలు వగైరా వుంటాయి. ఇక్కడికొచ్చినవారు వాటిని కోల్పోవాల్సి వస్తోంది. ఎంతో సంపన్నవంతమైన అమెరికాయే వలసలను అడ్డుకోవటానికి వేలాది మందిని జైళ్లపాలు చేస్తోంది. వెనక్కి పంపుతోంది. చాలా యూరప్ దేశాలు ఆ మార్గాన్నే అనుసరిస్తున్నాయి. ఇక అంతంత మాత్రం ఆర్థిక వ్యవస్థలతో సతమతమయ్యే దేశాల్లో శరణార్థులను, వలసదారులను ఆదరిస్తారని ఆశించటం దురాశే. ఎవరెంత వ్యతిరేకిస్తున్నా, ద్వేషిస్తున్నా వలసలు మున్ముందు మరింత పెరుగుతాయని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. ఎందుకంటే వారు తమ ఇష్టానుసారం రావటం లేదు. తప్పనిసరై, గత్యంతరం లేక స్వస్థలాలను వదల వలసి వస్తోంది. వలసలను వ్యతిరేకించటం కాక, వాటిని అనుకూలంగా మలుచుకోవటం ఎలాగో నేర్చుకోవటం అన్ని దేశాలకూ తప్పనిసరి.

# భారత్‌కు పశ్చిమాసియా సెగ

న్యూఢిల్లీ,ఉరుము ఉరిమి మంగలంమీద పడిన చందంగా ఇరాన్ -ఇజ్రాయెల) మధ్య రగిలిన యుద్ధజ్వాలల ప్రభావం పరోక్షంగా భారత్‌పై పడే సూచనలు అధికంగా కనిపిస్తున్నాయి. ఇరాన్- ఒమన్ దేశాలను విభజిస్తూ, పర్షియన్ గల్ఫ్‌కు దారితీసే కీలకమైన హర్మూజ్ జలసంధికి యుద్ధం విస్తరించినట్లు తాజాగా ఆ ప్రాంతంలో మూడు నౌకలు దగ్ధమవడాన్ని బట్టి తెలుస్తోంది. అదే నిజమైతే, భారత్ సహా అనేక దేశాలు చమురు సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడే పరిస్థితి ఎంతో దూరంలో లేదు. అత్యంత ఇరుకైన హర్మూజ్ జలసంధి ద్వారానే పశ్చిమాసియా దేశాలనుంచి ప్రపంచానికి రోజూ కోట్లాది పీపాల చమురు రవాణా అవుతూ ఉంటుంది. పశ్చిమాసియా దేశాలనుంచి భారత్ దిగుమతి చేసుకునే చమురులో 40 శాతం ఈ మార్గం ద్వారానే వస్తుంది. యుద్ధ సమయంలో ఈ మార్గం గుండా వెళ్తున్న చమురు ఓడలపై దాడులు చేసి, వైరిపక్షాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించడం కద్దు. నాలుగు దశాబ్దాల కిందట ఇరాన్ ఇరాక్ మధ్య యుద్ధం మొదలైనప్పుడు హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే చమురు ఓడలపై పరసర్పం దాడులు జరుపుకోవడంతో ప్రపంచ దేశాలు చమురు సంక్షోభంలో చిక్కుకున్న విషయం విస్మరించరాని అంశం. ఇరాన్ ఒమన్ దేశాలను విడదీసే హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌దే ఆధిపత్యం. యుద్ధం ముదిరితే ఈ జలసంధిని ఇరాన్ మూసివేసే ప్రమాదం ఉంది. అలాగే ఇరాన్ నుంచి చమురును రవాణా చేసే ఓడలపై ఇజ్రాయెల్ దాడులు చేయనూవచ్చు. దీంతో చమురు అందక అనేక దేశాలు అల్లాడిపోవడం తథ్యం. భారత్‌కు సైతం ఒకప్పుడు ఇరానే అతి పెద్ద చమురు ఎగుమతిదారు. 2019లో అమెరికా ఆంక్షలు విధించడంతో ఇరాన్ నుంచి చమురు దిగుమతులు తగ్గించుకుని, రష్యా, ఇరాక్, సౌదీ అరేబియాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. హర్మూజ్ జలసంధిలో దాడులు పెరిగితే చమురు రవాణా స్తంభించిపోయి, ధరలు ఆకాశాన్నంటితే ఆ పరిణామం భారత్‌కూ ప్రమాద హేతువే. మరోవైపు దౌత్యపరంగానూ భారత్ చిక్కుల్లో పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలతో భారత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. రెండింటిలో ఏదో ఒక దేశాన్ని ఎంచుకోమంటే అది భారత్‌కు ఆత్మహత్యాసదృశమే అవుతుంది. అందుకే ఎప్పటిలాగే తటస్థ వైఖరిని అవలంబిస్తోంది. ఇటీవల షాంఘై సహకార సంస్థ ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని నిర్ద్వంద్వంగా ఖండించగా, భారత్ మాత్రం దౌత్యపరమైన మార్గాల ద్వారా యుద్ధానికి పరిష్కారం కనుగొనాలంటూ మధ్యేమార్గాన్ని అనుసరించింది. షాంఘై సహకార సంస్థలో ఇరాన్, భారత్ రెండూ సభ్యదేశాలే అయినప్పటికీ భారత్ గోడమీది పిల్లివాటాన్ని ప్రదర్శించడం అనేక విమర్శలకు దారితీసింది. బ్రెజిల్‌లో వచ్చే నెలలో జరగనున్న బ్రిక్స్ సదస్సు కూడా భారత్‌కు సంకటంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. బ్రిక్స్ దేశాల కూటమిలో ఇరాన్‌కు కూడా సభ్యత్వం ఉండటంతో భారత్ పరిస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యి చందంగా మారబోతోంది. ఇరాన్‌ను సమర్థించడం ద్వారా ఇజ్రాయెల్‌తో విభేదిస్తే అమెరికాతో కోరి కయ్యం తెచ్చుకున్నట్లే అవుతుంది. ఇక, ఇరాన్‌లో భారత్ ఇప్పటికే చేపట్టిన చాబహార్ ఓడరేవు నిర్వహణపై కూడా యుద్ధ మేఘాలు కమ్ముకున్నట్లే కనిపిస్తోంది. ఈ ఓడ రేవు కోసం భారత్ ఇప్పటికే కోట్లాది డాలర్లు ఖర్చు చేసింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఓడరేవు దెబ్బతింటే, అది భారత్‌కు తీరని నష్టం కలిగిస్తుంది. మరోవైపు ఇరాన్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులను క్షేమంగా స్వదేశానికి తీసుకురావలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. యుద్ధ నేపథ్యంలో ఇరాన్ గగనతలాన్ని మూసివేయడంతో టెహ్రాన్ నుంచి భూమార్గం ద్వారానే విద్యార్థుల్ని తీసుకురావలసి ఉంటుంది. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధానికి చరమగీతం పాడేందుకు అగ్రదేశాలు చేయీచేయీ కలపకపోతే చమురు సంక్షోభం ప్రపంచాన్ని కుదిపివేయడం తథ్యం. ఇప్పటికే చమురు ధరలు



అంతకంతకూ ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో, యుద్ధం మరింత ముదిరితే ద్రవ్యోల్బణం పెచ్చుమీరి, అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలం కావచ్చు. అయితే, అణు ఒప్పందంపై ఇరాన్ సంతకం చేస్తే తప్ప ఈ యుద్ధం ఆగేది కాదని అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ మొండికేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ తోనూ, ఇజ్రాయెల్ తోనూ స్నేహ సంబంధాలు గల భారత్ మధ్యవర్తిత్వానికి నడుం బిగించాలి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను నివారించే సామర్థ్యం భారత ప్రధానికి ఉందంటూ భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం.

## ఫాస్టాగ్ పాస్‌ల ఆలోచన భేష్

అమరావతి,ఫాస్టాగ్ పాస్‌ల ఆలోచనను ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ స్వాగతించారు. ఇదో మంచి ముందడుగని అన్నారు. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో దీన్నో గేమ్ ఛేంజర్‌గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ నిర్ణయంతో ఫాస్టాగ్ వార్షిక పాస్ తీసుకురావాలన్న ప్రయాణికుల దీర్ఘకాలిక డిమాండ్‌కు పరిష్కారం లభించినట్లవుతుందని పేర్కొన్నారు. టోల్ చెల్లింపులను సరళీకృతం చేస్తూ.. ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను అమలులోకి తీసుకొస్తున్నందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రూ.3వేల వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థిక ఉపశమనం కలగడం మాత్రమే కాదు.. దేశ వ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, వివాద రహిత హైవే ప్రయాణం సాకారమవుతుందన్నారు. దీని ద్వారా టోల్ ఎ÷-లాజాల సమీపంలో నివసిస్తూ రెగ్యులర్‌గా ప్రయాణించే వారికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. వారికి సమయంతో పాటు భారం కూడా తగ్గుతుంద న్నారు. ఈ నిర్ణయం నితిన్ గడ్కరీకి మోదీ సారథ్యంలోని ప్రజా పాలన పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.3 వేలు చెల్లించి ఈ పాస్ తీసుకోవాల్సి ఉంటుందని ఆయన 'ఎక్స్'లో చేసిన పోస్టును పవన్ రీట్వీట్ చేస్తూ పైవిధంగా స్పందించారు. అయితే కార్లు, జీపులు, వ్యాన్లు వంటి నాన్- కమర్షియల్ వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. పలు నిబంధనలు ఉండే అవకాశముంది.

# గోదావరి వృధా జలాలను వాడుకోవాల్సిందే

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో హీట్ పెరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆమె, ముఖ్యమంత్రి చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి, సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. 'బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు నష్టం జరగదని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు చెబుతుండగా, గోదావరి జలాలను తరలించేందుకు కేసీఆర్ అప్పుడు ఒప్పుకున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. కేసీఆర్ గోదావరి నీళ్లు సముద్రంలో వృథాగా పోకుండా వాడుకలోకి తేవాలని మాత్రమే అన్నాడు. కానీ, నదుల అనుసంధానం అంశానికి ఎప్పుడూ ఓకే చెప్పలేదు అని ఆమె వివరణ ఇచ్చారు. ఏపీ కోసం చంద్రబాబు పోరాటం చేస్తున్నారని చెబుతున్నారు. అలా అయితే మన సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు? చంద్రబాబుతో రేవంత్‌కు ఉన్న లాలూచీ ఏమిటి? అని ప్రశ్నించారు. నల్లమల టైగర్ అంటూ కాదు, పని చేసి చూపించండి 'రేవంత్ రెడ్డి నల్లమల టైగర్ అంటూ చెప్పుకుంటున్నారు. అది నిజమే అయితే బొల్లపల్లి రిజర్వాయర్ ప్రాజెక్ట్‌ను నిలిపివేయాలి. లేదంటే, మీరు కేవలం పేపర్ పులి అని ప్రజలకు తేటతెల్లం అవుతుంది,' అంటూ సెటైర్లు వేశారు. 'ఢిల్లీకి హాఫ్ సెంచరీ కొడుతున్నారు కానీ బీసీల కోసం అడగడంలేదు. బీసీ బిల్లు గురించి మోదీని అడగాలి,' అని స్పష్టం చేశారు. బీసీలకు రాజకీయం హక్కులు లభించేలా కేంద్రం వెంటనే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ, జులై 17న రైలు రోకో నిర్వహిస్తామని ప్రకటించారు. ఢిల్లీకి వెళుతున్న సీఎం.. బీసీ బిల్లు పట్టుకుని తిరిగి హైదరాబాద్‌కు రావాలి అంటూ హెచ్చరించారు.

## పశ్చిమాసియా యుద్ధ వాతావరణం..

న్యూఢిల్లీ,పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చముఉ ధరలు పెరిగే ప్రమాదం ఉంది. అందేకాకుండా డాలర్ మారకం కూడా పెరిగే ప్రమాదం ఉంది. అలాంటి సంకేతాలు కూడా అందుతు న్నాయి. ఇరాన్ కనుక పట్టుదలకు పోతే చమురు రవాణాకు తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశాలు మెండుగా ఉ న్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటి ప్రభావం ధరలపై పడుతోంది. తద్వారా సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. సజావుగా ఉన్నప్పుడే దిద్దుబాటు చర్యలు ఉంటాయా అన్నది అనుమానంగానే ఉండేది. ఇప్పటికే ధరలు అదుపులోకి రావడం లేదు. నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగించుకుని వస్తూత్పత్తిని పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. చమురు ధరలు పెరిగితే ఇది మరింత పతనం కావచ్చు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇదే సూచిస్తున్నాయి. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జిఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. యూపిఐ పేమెంట్లపై సర్‌ఛార్జ్ విధిస్తారన్న వాదనలు బలంగా ముందుకు వచ్చాయి. కానీ తీవ్ర విమర్శలు రావడంతో..అలాంటిదేమీ లేదని సమాధానం వచ్చింది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం. ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలు బాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మౌనముని మోడీ మాత్రం నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది. మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో విదేశాలకు వెళ్లే విద్యార్తులకు చదువులు భారంగా మారాయి. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది.

## బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణ

హైదరాబాద్, హైదరాబాద్ లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్, బెంగుళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు అనుకూలమైనవని రేవంత్ వివరించారు. ఇప్పటికే హైదరాబాద్ లో డిఫెన్స్ కు సంబంధించి వివిధ సంస్థలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ / సీఈవో డా, జైతీర్థ్ ఆర్. జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీ.ఏ. శ్రీనివాస మూర్తి, తదితరులు సీఎంతో భేటీ అయ్యారు. దేశంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమని చెప్పారు.

# భద్రతలేని బాసర తీరం...



బాసర,ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర గోదావరి నదిలో పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు భద్రత కరువైంది. ఆలయానికి కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా.. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే చోట భద్రతా చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఐదేళ్లుగా అధికారుల నిర్లక్ష్యానికి 51 మంది బలయ్యారు. సాధారణంగా జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు తొలుత గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. అయితే స్నాన ఘాట్ వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. అలాగే ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. కొందరు నది మధ్యలో ఉన్న ఇసుకమేటల వరకూ పడవలో వెళ్లి అక్కడ స్నానాలు చేస్తున్నారు. ఇక్కడ సుమారు ముప్పయి వరకు పడవలు ఉన్నాయి. ఇసుక మేటల వరకూ తీసుకెళ్లి అక్కడ వదిలి పడవ నిర్వాహకులు వచ్చేస్తున్నారు. ఆ ఇసుక మేటల వద్ద స్నానాలు చేసే వారికి నీటి లోతు తెలియక ప్రమాదాలకు గురై గల్లంతు అవుతున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని చింతల్ బరి, దిల్‌షుక్‌నగర్‌కు చెందిన ఐదుగురు గోదావరి నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. గత వారం పుణ్యస్నానాలు చేయడానికి వచ్చి ఇద్దరు మృతి చెందారు.

ఐదేళ్లలో 51 మంది బలి

గోదావరి నదిలో ఐదేళ్లలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. 2021లో పది మంది 2022లో 12 మంది, 2023లో 11 మంది, 2024లో పది మంది 2025 లో ఆరు నెలలకు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు.

ఇదీ నిర్లక్ష్యం

స్నానాల ఘాట్ వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేవని, గజ ఈతగాళ్ల జాడే లేదని, లైఫ్ జాకెట్లు మచ్చుకైనా కనిపించలేదని, అధికారులు, సిబ్బంది భక్తులను పట్టించుకున్న పాపాన పోవడంలేదని పలువురు భక్తులు ఆరోపించారు. నది లోపలికి వెళ్లకుండా ఉండేందుకు ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టలేదని, కనీసం కంచె ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలనిడిమాండ్ చేశారు.

ఇష్టానుసారంగా బోటింగ్ నిర్వహణ

బాసర వద్ద గోదావరి నదిలో బోటింగ్ నిర్వహణ ఉంది. నాటు పడవలతో బోటింగ్ నిర్వహిస్తుంటారు. ఎక్కడ నిబంధనలు పాటించడం లేదు. సుమారు ముప్పయికి పైగా పడవలు ఉన్నాయి. గోదావరి నది మధ్యలో ఉన్న ఇసుక మేటల వద్దకు పడవలో కొందరు భక్తులు వెళ్లి అక్కడ స్నానాలు చేసి వస్తుంటారు. అయితే ఇసుక దిబ్బల వద్ద కూడా హెచ్చరిక బోర్డులు లేవు. గజ ఈతగాళ్లు కూడా లేరు. అలాగే పడవ నిర్వాహకులు కూడా భక్తులను ఇసుక మేటల వద్ద దించి తిరిగి వచ్చేస్తారు. దీంతో ఇసుక మేటల సమీపంలో స్నానాలు చేసే వారికి గోదావరి లోతు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా బాసర వద్ద గోదావరి రిలో పడవల సంచారంపై నిషేధ విధిస్తూ భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి సోమవారం ఉత్త ర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నదిలో పడవలను తిప్పరాదని పడవలు నడిపే వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

పర్యవేక్షణ కరువు

బాసర ఆలయానికి గత రెండు సంవత్సరాలుగా రెగ్యులర్ ఈవోను నియమించకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. ఆలయంతో పాటు గోదావరి నది తీరం పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత, భద్రత చర్యలపై పర్యవేక్షించే వారు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కీసర ఆలయ ఈఓ సుధాకర్ రెడ్డిని ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్

నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రం సమీపాన గోదావరిలో రెండు రోజుల కిందట ప్రమాదానికి గురై ఐదుగురు మృతి చెందిన సంఘటనపై న్యాయవాది ఇమ్మానేని రామారావు జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ)లో పిటీషన్ దాఖలు చేశారు. బాసరలో అధికారుల నిర్వహణ లోపం, అడుగడుగునా నిర్లక్ష్యం కారణంగా ఐదు నిండు ప్రాణాలు బలైనట్లు ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రెండు రోజుల కిందట మృతులు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పిటిషన్ స్వీకరించిన కమిషన్ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

## వరుసగా కేంద్రమంత్రులతో భేటీ

న్యూఢిల్లీ, ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ' రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అక్కడి ప్రజల చిరకాల కోరికని అన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించండి. న్యాయపరమైన అవసరాల కోసం రాయలసీమ ప్రజలు ఏపీ రాజధానికి రావడానికి 500 కి.మీ పైగా ప్రయాణించాల్సి ఉంటుంది. యువగళం పాదయాత్ర సందర్భంగా సీమ ప్రజలు, న్యాయవాదులు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా త్వరితగతిన బెంచ్ ఏర్పాటుకు సహకరించాలి. రాష్ట్రంలోని కోర్టుల్లో జ్యుడిషియరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి సహకారం అందించండని కేంద్రమంత్రిని కోరారు. యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని లోకేశ్ కేంద్రమంత్రికి అందజేశారు. ఇకపోతే కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిశారు.. పండ్లతోటల అభివృద్ధికి అన్నివిధాల అనుకూలమైన వాతావరణం కలిగిన రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని చిరాగ్ పాశ్వాన్ కు మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తో మంత్రి లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ? రాయలసీమలో రైతులు మామిడి, అరటి, టొమాటో, బత్తాయి, దానిమ్మ, డేట్స్ వంటి పండ్లతోటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.. యువగళం పాదయాత్ర సందర్భంగా వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశాను అన్నారు నారా లోకేష్? ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా అక్కడి రైతులకు మెరుగైన రేట్లు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉంది. రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు సహకరించాలని లోకేష్ కోరారు. దీనికి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ? ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం అందిస్తాం. తిరుపతి ట్రిపుల్ ఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి నేను ఏపీకి వస్తున్నాను. జులై 11, 12 తేదీల్లో రాయలసీమ పర్యటనకు వస్తున్నా. మీరు కూడా వస్తే క్షేత్రస్థాయిలో పర్యటించి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం చేద్దాం. అన్నదాతలకు మేలు చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని చెప్పారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని ఈ సందర్భంగా చిరాగ్ పాశ్వాన్ కు మంత్రి నారా లోకేష్ అందించారు..

## పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు

న్యూఢిల్లీ, ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమవుతుండటంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ సింధు' అని నామకరణం చేసినట్లు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తున్న వేళ.. ఉత్తర ఇరాన్ నుంచి జూన్ 17న ఆర్మేనియాకు చేరుకున్న 110 మంది విద్యార్థులను భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేసింది. వీరంతా ఆర్మేనియా రాజధాని యెరవాన్ నుంచి ప్రత్యేక విమానంలో భారత్‌కు బయల్దేరారు. జూన్ 19న తెల్లవారు జామున న్యూఢిల్లీకి చేరుకోనున్నారు. విదేశాల్లో ఉన్న తన పౌరుల భద్రతకు భారత్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర విదేశాంగ శాఖ అధికారి ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్ నగరం దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో అక్కడి భారత ఎంబసీ ఇప్పటికే ప్రత్యేక అడ్వైజరీని జారీ చేసింది. తక్షణమే ఆ నగరాన్ని వీడాలని కోరింది. టెహ్రాన్ వెలుపల సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని భారతీయులకు సూచించింది. ఇప్పటివరకు భారత ఎంబసీని సంప్రదించని భారతీయులు వెంటనే దౌత్యాధికారులతో కాంటాక్ట్ అవ్వాలని కోరిన విషయం తెలిసిందే. ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో ఆ రెండు దేశాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంటున్న తెలంగాణవాసులకు సాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం దిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ప్రారంభించింది. ఇప్పటివరకూ రాష్ట్ర వాసులు ఎవరూ ప్రభావితం అయినట్లు సమాచారం లేకపోయినా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ముందుజాగ్రత్తగా ఈ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తాము ఉంటున్న దేశాల్లో గానీ, ప్రయాణాల్లో గానీ ఇబ్బంది పడుతున్న తెలంగాణ వాసులు కింద పేర్కొన్న నంబర్లను సంప్రదించవచ్చని తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. వందన- రెసిడెంట్ కమిషనర్ పీఎస్- 91 9871999044, జి.రక్షిత్‌నాయక్, లైజన్ ఆఫీసర్- ?91 9643723157, జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్- ?91 9910014749, సీహెచ్ చక్రవర్తి, పౌరసంబంధాల అధికారి- ?91 9949351270.

## స్థానిక ఎన్నికలపై ఫీవర్..

నిజామాబాద్, బీసీ గణనకు సంబంధించి కమిషన్ల రిపోర్టులు ఆధారంగానే రిజర్వేషన్లు పెంచి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. బహుశా జూలైలో స్థానిక ఎన్నికలు జరిగే ఛాన్స్ ఉందంటూ వార్తలు వస్తున్నాయి. 42శాతం బిసి రిజర్వేషన్లు ప్రకటించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇవిప్రకటించి చిత్తుశుద్ధి చాటుకోవాలని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్లు ప్రకటించకుండా స్థానిక ఎన్నికలకు వెళితే ఊరుకోమని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. ఇకపోతే ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బిఆర్ఎస్ భావిస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఫుట్‌బాల్ ఆడుతామని కెటిఆర్ ప్రకటించారు. తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రకటించారు. తాజాగా జిల్లాలో 14,35,214 మంది ఓటర్లుండగా పురుషులకన్నా 80,875 మంది మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్నట్టు లెక్క తేలింది. మహిళల తర్వాత యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారు 26 వేల వరకు ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువతీయువకులే దాదాపు సగం వరకు ఉన్నారు. కొత్త జాబితా ప్రకారం 18 నుంచి 39 ఏండ్ల మధ్య వయస్సున్న ఓటర్ల సంఖ్య 6, 96,014. దీంతో రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో మహిళలు, యువతే కీలకం కానున్నారు. దీంతో యువతలో కూడా సర్పంచ్ పదవులపై ఆశ కనిపిస్తోంది. పంచాయితీలతో పాటు వాటి పరిధిలోని 5,022 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్స్ లతో పాటు పేపర్ బ్యాలెట్ రెడీ చేశారు. జిల్లాలో 31 మండలాలున్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటి లోనూ యువత, మహిళలే నిర్ణేతలు కానున్నారు. వారు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే అందలమెక్కే చాన్స్‌ఉందని అంటున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా మాజీలయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్ల టర్మ్ పూర్తికానుంది. దీంతో రూరల్, అర్బన్ లోకల్ బాడీలకు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా 15 గ్రామ పంచాయ తీలు ఏర్పడడంతో జిల్లాలో పంచాయితీల సంఖ్య 545 పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో అప్పుడే స్థానిక హడావిడి మొదలయ్యింది. ముఖ్యంగా పంచాయితీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారంతా ఇప్పటి నుంచే గ్రామాల్లో కరచాలనాలు మొదలు పెట్టారు. పలకరింపులు చేస్తున్నారు. బాగున్నావా అని ఆత్మీయంగా చూస్తున్నారు. పెళ్లిళ్లు , పేరంటాల సందర్భంగా గ్రామాల్లో ఇదే సందడి కనిపించింది. వాడు సర్పంచ్‌కు పోటీ చేస్తున్నాడనే కామెంట్స్ కూడా బాగానే వినిపించాయి. ఇకపోతే జిల్లాలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాన్సువాడ సెగ్మెంట్‌లోని కొన్ని మండలాలున్నాయి.

# పెద్దదిక్కు లేక డీలా!

హైదరాబాద్,తొలి విడత మంత్రి వర్గ విస్తరణలో మంథని ఎంఎల్ఏ దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు మంత్రి వర్గంలో చోటు కల్పించారు. రెండవ విడత మంత్రి వర్గంలో పలువురు మంత్రి పదవులు ఆశించినా ధర్మపురి ఎంఎల్ఏ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించింది. కరీంనగర్ జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో మంత్రి శ్రీధర్ బాబు మాత్రమే అధికార కార్యక్రమాలైన జెండా పండుగలకు హాజరు అవుతున్నారు. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు అడ్లూరి, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తారంటు ప్రచారం జోరుగా కొనసాగుతున్నది.ఒకప్పుడు మంత్రులతో కళకళలాడిన కరీంనగర్ నేడు మంత్రులు లేక జిల్లా కేంద్రం వెలవెలబోతున్నది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది కరీంనగర్ దుస్థితి. తెలంగాణ సాధన కోసం ఏది తలపెట్టాలన్నా కరీంనగర్ నుంచే ప్రారంభం అయ్యేది. అలాంటి పేరున్న కరీంనగర్ జిల్లా కేంద్రానికి కాంగ్రెస్ పాలనలో అసలైన నాయకుడు లేక తల్లడిల్లుతున్నది. కరీంనగర్ కేంద్రం ఒక ప్పుడు మంత్రులతో రాకతో ఎర్రబుగ్గ కారులు కుయ్యి.. కుయ్యి అనే శబ్దాలతో కాన వచ్చిన కన్నారం ఇప్పుడు మాత్రం కానరావడం లేదని అందరి నోటా అదే మాట వినిపిస్తున్నది. సమస్యలు చెప్పుకుని.. విప్పుకుందామన్న సరై'అయి'నా లీడర్ లేకపాయే ప్రజల మంచికో.. చెడుకో జిల్లా కేంద్రంగా మంత్రి ఉండాలని కోరుకుంటున్నారు.

రాజకీయంగా డీలాపడ్డా కరీంనగర్

కరీంనగర్ జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా.. వెలుగులు వెలిగిన జిల్లా.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించింది. తెరాస 14 సంవత్సరాల పాలనలో ఉమ్మడి జిల్లాలో నలుమూలల నుండి మూడు నియోజక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించి మంత్రి పదవులు ఇచ్చారు. కరీంనగర్ జిల్లాకు మంత్రి వర్గ విస్తరణలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అధిక ప్రాధాన్యత కల్పించారు. నగరం స్మార్ట్ సిటీ నిధులతో అద్భుతంగా మారినప్పటికీ అధికార పార్టీకి అసలైన నేత లేక జిల్లా ఇప్పుడు వెలవెలబోతున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 13 నియోజక వర్గాల్లో హుస్నాబాద్, సిద్దిపేట కొత్త జిల్లాలో ఉండగా, మిగతా 12 నియోజక వర్గాలు మాత్రం పాత కరీంనగర్‌లోనే ఉన్నాయి. 13 నియోజక వర్గాల్లో 5 స్థానాలైనా సిరిసిల్ల, కరీంనగర్, హుజురాబాద్, కోరుట్ల, జగిత్యాలలో గులాబీ జెండా ఎగిరింది. మిగతా 8 స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగిరింది. తొలి విడత మంత్రి వర్గ విస్తరణలో మంథని ఎంఎల్ఏ దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు మంత్రి వర్గంలో చోటు కల్పించారు. రెండవ విడత మంత్రి వర్గంలో పలువురు మంత్రి పదవులు ఆశించినా ధర్మపురి ఎంఎల్ఏ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించింది. కరీంనగర్ జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో మంత్రి శ్రీధర్ బాబు మాత్రమే అధికార కార్యక్రమాలైన జెండా పండుగలకు హాజరు అవుతున్నారు.జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు అడ్లూరి, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తారంటు ప్రచారం జోరుగా కొనసాగుతున్నది. రెండు పార్లమెంట్ నియోజక వర్గాలు ఉండగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని చెన్నూరు, మంథని, ధర్మపురి నియోజకవర్గాల ఎంఎల్ఎలకు మాత్రం మంత్రి పదవులు దక్కగా, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్ ఎంఎల్ఏ పొన్నం ప్రభాకర్‌కు మాత్రమే మంత్రి వర్గంలో చోటు లభించింది. కరీంనగర్ పాత జిల్లా ఒకప్పుడు వెలుగులు వెలుగగా ఇప్పుడు మాత్రం మంత్రులతో విడిపోయిన జిల్లాలు వెలుగులు వెలుగుతున్నాయని అందరినోటా అదే మాట వినిపిస్తున్నది. కాంగ్రెస్ పార్టీలో వర్గపోరుతో కరీంనగర్ జిల్లాకు సరైనా పదవులు రావడం లేదని ఆ పార్టీ నేతల్లో చర్చ జరుగుతున్నది. ఇటీవల ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో తోపులాట, కుస్తీలాటే.. దీనికి నిలువెత్తు సాక్షం ఏఐసిసి నేతలే అని చెప్పక తప్పదు.అప్పటి తెలంగాణ తొలి సిఎం కెసిఆర్ అండదండలతో స్మార్ట్ సిటీ హోదా దక్కించుకున్న విషయం అందరికీ తెలిసిందే. కరీంనగర్ అభివృద్ధికి నిధుల కొరత లేకున్నా నేడు అభివృద్ధి పనులకు ఆటంకాలు కలుగక తప్పడం లేదు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత కూడా కరీంనగర్ ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ప్రతి పథకాన్ని కరీంనగర్ నుండే ఆనాటి సిఎం కెసిఆర్ శ్రీకారం చుట్టారు. ఇప్పుడు మాత్రం ప్రభుత్వ పాలకుల మదిలో కానరావడం లేదు. ఎలాంటి అభివృద్ధి ముందుకు సాగడం లేదని, పని చేసే వారికి గుర్తింపు ఇవ్వడం లేదని



జరిగిన కాంగ్రెస్ సమావేశాలో పార్టీ శ్రేణులు ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసి నిరసన తెలపగా, అగ్రనేతల బుజ్జగింపులతో నిరసనలు సద్దుమణిగాయి. కరీంనగర్‌కు లీడర్ అనే వ్యక్తి లేకపోవడంతో అధికారులు సైతం తమకు పని చేయడం లేదని ఆ పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న లీడర్ వద్దకు వెళ్దామన్నా మరో లీడర్‌కు సమాచారం వెళుతుందని గుట్టుచప్పుడు కాకుండా ఉంటున్నారు. ఉద్యమ పోరు జిల్లా కేంద్రంలో ఒక మంత్రినే ప్రతి కార్యకర్తకూ, ప్రతి ఒక్కరికీ పని జరుగుతుందని చెప్పుకుంటున్నారు. బిఆర్ఎస్ మాత్రం ఇచ్చిన హామీలు కాంగ్రెస్ నెరవేర్చడం లేదని వ్యతిరేక ప్రచారం చేస్తుంటే వారి ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు సలహాలతో కూడిన కార్యక్రమాలను చేద్దామని కాంగ్రెస్ శ్రేణులు ఉన్నా కూడా ముందుకు నడిపించే నేత లేదని వారిలో చర్చ మొదలైంది. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం ఆలోచించి కరీంనగర్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

## గోదావరి- బనకచర్లను వ్యతిరేకిస్తూ కేంద్రాని తీర్మానం

హైదరాబాద్, జగన్‌తో మిలాఖత్ అయిన తరవాతనే ఆనాటి సిఎం కెసిఆర్ గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు 2019 అక్టోబరులో కేసీఆర్, జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించటంపై చర్చించు కున్నారని అన్నారు. . గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే అంకురార్పణ జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. గోదావరి-బనకచర్లపై అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. గోదావరి-బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించాం. అన్ని పార్టీలను కలుపుకొని పోరాడుతాం అని వివరించారు. నిజానికి రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు నమస్తే తెలంగాణలో రాశారని సీఎం తెలిపారు. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు. '2192016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించింది. ఏటా 3వేల టీఎంసీల నీరు వృథాగా గోదావరి నీరు సముద్రంలో కలుస్తోందని అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ అన్నారు. 3వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని మొదట మాట్లాడింది కేసీఆరే. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా దస్త్రాల రూపంలో ఉంది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని ఆనాడు తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారు. తెలంగాణకు కృష్ణాలో 299 టీఎంసీలు సరిపోతాయని ఆనాడు కేసీఆర్ ఒప్పుకొని సంతకం చేశారు. ఆనాడు కేసీఆర్ చేసిన సంతకం ఇవాళ తెలంగాణకు ప్రతిబంధకంగా మారింది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం తెలిపారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ మాట్లాడారని వివరణ ఇచ్చారు. కృష్ణానదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే అభ్యంతరం లేదని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. సమావేశం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందన్నారు.

## 25 లక్ష రివార్డు ప్రకటించిన ప్రభుత్వం

వరంగల్,ఉత్తరాంధ్రలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలిశాలకు చెందిన గాజర్ల రవి మృతి చెందాడు. ఈ ఘటనతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. గాజర్ల రవి మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధు మిత్రులు శోకసంద్రంలో మునిగారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. పెత్తందార్ల వ్యవస్థకు వ్యతిరేకంగా తాడిత, పీడిత, బలహీన వర్గాల కోసం పోరుబాట ఎంచుకున్న వారిలో వెలిశాలలోని గాజర్ల కుటుంబం ఒకటి. కుటుంబంలోని అందరు కూడా అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమం వైపు అడుగులు వేశారు. గాజర్ల కుటుంబంలోని నలుగురు సోదరుల్లో ముగ్గురు అజ్ఞాతంలోకి వెళ్లారు. పెద్దవాడైన సమ్మయ్య సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ చేసి హన్మకొండలో స్థిరపడ్డారు. ఆయనపై కూడా మావోయిస్ట్ సానుభూతిపరుడిగా ముద్రవేయడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మిగతా ముగ్గురు అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్ళారు.

## సాగునీటి ప్రాజెక్టులపై ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం

హైదరాబాద్,బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. త్వరలో పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం కానున్నారు. ఇక రైతుల పక్షాన మరో పోరాటానికి సిద్ధమవుతున్నారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా సమావేశం ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ చూపిస్తున్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంపై తెలంగాణ రైతాంగం తరపున పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ రెడీ అయింది. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంపై చర్చించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో త్వరలోనే కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నది. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం, రైతు వ్యతిరేక వైఖరిపై ప్రధానంగా చర్చిస్తారు. ఊష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం వహించడంపైన చర్చించనున్నారు. బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తి అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనబెట్టడంతో పాటు 2 పిల్లర్లు కుంగాయన్న సాకుతో మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను నాయకులకు కేసీఆర్ వివరిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో లక్షల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందకుండా పోతున్నది. రాజకీయ దురుద్దేశంతోనే అన్నదాతలపైన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణ పై చర్చించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా ప్రభుత్వం చూపుతున్న అలసత్వం వలన తెలంగాణకు తీరని నష్టం కలుగుతుందని, ఈ అంశంలో ఉద్యమ కార్యాచరణకు బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేయనుంది. ఏడాదిన్నర కాలంగా తెలంగాణ రైతులను నిండా ముంచుతున్న కాంగ్రెస్ ద్రోహాన్ని ఈ కీలక సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సమగ్రంగా చర్చించనున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం జరగనుంది. రైతుల కొరకు ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని నిర్ణయించారు. కాగా.. జూన్ 15న మాజీ మంత్రి హరీశ్‌రావు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసిన విషయం తెలిసిందే.

## ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త విషయాలు

హైదరాబాద్,ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొన్ని పార్టీలు లేదా వ్యక్తులు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారన్న నెపంతో, పలువురు కీలక రాజకీయ నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు వెల్లడవుతోంది. తాజాగా ఈ కేసులో 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుపై ఆరోపణలు వచ్చాయి. 2023 నవంబర్ 15 నుండి 30వ తేదీ మధ్యలోనే కనీసం 618 మంది నేతల ఫోన్లను ట్యాప్ చేశారట. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ నాయకులు కూడా ఉన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి, కోటింరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి వంటి నాయకుల ఫోన్లను కూడా ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం ట్యాప్ చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ సహా అనేక పార్టీల కీలక నేతలు, అనుచరుల ఫోన్లు కూడా ట్యాపింగ్ లక్ష్యంగా మారాయి. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేగంగా దర్యాప్తు కొనసాగిస్తోంది. నిన్న ఒక్కరోజే తొమ్మిది మంది సాక్షుల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. అందులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఆమె భర్త తిరుపతయ్య, గాంధీ భవన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు ఉన్నారు. ఇవన్నీ మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చిన ఆధారాలతో వెలుగులోకి వచ్చాయి. ఈ రోజు పీసీసీ అధికార ప్రతినిధి జయపాల్ రెడ్డి సిట్ ముందు హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చారు. అదే విధంగా ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును కూడా విచారించారు.

# ఒకప్పుడు మంచి మిత్రులు, ఇప్పుడు బద్ధ శత్రువులు..



టెహ్రాన్:ఇరాన్ అణు కార్యక్రమాన్ని టార్గెట్ చేస్తూ ఇజ్రాయిల్ దాడులు చేసింది. ఇరాన్ అణు శాస్త్రవేత్తలతో పాటు ఆ దేశ మిలిటరీ టాప్ జనరల్స్‌ని హతమార్చింది. ప్రతిగా, ఇరాన్, ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్, జెరూసలెం, హైఫా నగరాలపై వందలాది మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఇరాన్‌లో 200 మందికి పైగా మరణించగా, ఇజ్రాయిల్‌లో 20 మంది మరణించినట్లు తెలుస్తోంది.

ఒకప్పుడు మిత్రులు, ఇప్పుడు శత్రువులు

అయితే, ఈ రెండు దేశాలు ఒకప్పుడు మంచి మిత్రులని చాలా మందికి తెలియదు. 1948లో ఇజ్రాయిల్ ఏర్పడినప్పుడు, చాలా ముస్లిం మెజారిటీ పశ్చిమాసియా దేశాలు ఇజ్రాయిల్‌ని గుర్తించేందుకు నిరాకరించాయి. అయితే, షియా ముస్లిం-మెజారిటీ కలిగిన ఇరాన్‌తో పాటు టర్కీలు ఇజ్రాయిల్‌ని గుర్తించాయి. దీనికి ఒక కారణం ఈ రెండు దేశాలకు అమెరికాతో సంబంధాలు ఉండటం.ఆ సమయంలో ఇరాన్‌ని షా మొహమ్మద్ రెజా పహ్లావి పాలిస్తుండేవారు. కోల్డ్ వార్ సమయంలో అమెరికాకు ఇరాన్ కీలక మిత్రదేశంగా ఉండేది. ఆ తర్వాత రెండు దశాబ్దాలు మాజీ ఇజ్రాయిల్ ప్రధాని డెవిడ్ బెన్ గురియన్ తన "పెరిఫెరీ డ్రాక్ట్రిన్" ద్వారా అరబ్ యేతర దేశాలతో పొత్తు పెట్టుకునే ప్రయత్నం చేశారు. ఇరాన్, టర్కీ, ఇథియోపియాతో ఇజ్రాయిల్‌కి మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. ఒకానొక సమయంలో ఇజ్రాయిల్ గూఢచర్య సంస్థ మొసాద్, ఇరాన్ సావక్ మధ్య ఆయుధాల అమ్మకాలు, నిఘా భాగస్వామ్యం పెంచుకోవాలని భావించాయి. ఇజ్రాయిల్ కు అరబ్ దేశాలతో జరిగిన "6-డే వార్" తర్వాత కూడా ఇరాన్, ఇజ్రాయిల్‌కి చమురు సరఫరా చేసింది. ఇరాన్‌లో వాణిజ్యం, మౌలిక సదుపాయాలకు ఇజ్రాయిల్ మద్దతు ఇచ్చింది.

మిత్రుడు శత్రువుగా మారిన వేళ

అంతా బాగానే ఉన్న సమయంలో 1979లో ఇరాన్‌లో వచ్చిన "ఇస్లామిక్ విప్లవం" తర్వాత ఇజ్రాయిల్‌తో ఇరాన్ సంబంధాల్లో మార్పు వచ్చింది. షా మొహమ్మద్ పదవి కోల్పోయాడు. అయతుల్లా రుహెల్లా ఖమేనీ నేతృత్వంలో ఇస్లామిక్ రిపబ్లిక్ గా ఇరాన్ ఏర్పడింది. ఇరు దేశాల మధ్య ఇస్లామిస్ట్ అంశాలు, పాలస్తీనా కోసం ఇరాన్ వాదించడంతో మిత్రుత్వం, శత్రుత్వంగా మారింది. ఇరాన్ ఇజ్రాయిల్ పాస్‌పోర్టులను అంగీకరించడానికి నిరాకరించింది. ఇజ్రాయిల్‌ని "ఇస్లాంకు శత్రువు", "చిన్న సైతాన్"గా ఇరాన్ అభివర్ణించింది.దీనికి తోడు ఇరాన్ తన ప్రాక్సీలుగా పాలస్తీనాలో హమాస్, లెబనాన్‌లో హిజ్బుల్లా, యెమెన్‌లో హౌతీలను పెంచిపోషించింది. 1983లో హిజ్బుల్లా లెబనాన్‌లోని ఇజ్రాయిల్ మిలిటరీ ప్రధాన కార్యాలయం ముందు ఆత్మాహుతి దాడి చేసింది. ఈ దాడి ఇజ్రాయిల్, వెస్ట్రన్ దేశాలు లెబనాన్ విడిచివెళ్లాలా చేసింది.డిసెంబర్ 2020లో ఇప్పటి ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఇజ్రాయిల్‌ని "క్యాన్సర్ కణితి"గా అభివర్ణించి, తొలగించాలని పిలుపునిచ్చాడు. 2023లో ఇజ్రాయిల్‌పై హమాస్ దాడితో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అయితే, హమాస్ వెనక ఇరాన్ ఉండి దాడి చేయించిందని ఇజ్రాయిల్ ప్రధాన ఆరోపణ. దీనికి తోడు, ఇరాన్ అణు అస్త్రాలకు మరికొంత దూరంలోనే ఉందనే నిఘా సమాచారం తర్వాత ఇజ్రాయిల్ ఇరాన్‌పై విరుచుకుపడుతోంది. ఏ అరబ్ దేశం వద్ద అణ్వాయుధాలు ఉండవద్దనేది ఇజ్రాయిల్ పాలసీ. ఇది తమ అస్తిత్వానికి ముప్పు తీసుకువస్తుందని భావిస్తోంది.

# జగన్ కి ఎవరు భయపడుతున్నారు ?



అమరావతి,ఏపీలో జగన్ గురించి ఎవరు భయపడుతున్నారు అన్నది చర్చగా ఉంది. జగన్ 2019 నుంచి 2024 మధ్యలో సీఎం గా చేశారు. ఆయన హయాంలో మూడు రాజధానుల నినాదం అందుకున్నారు. అయితే ఆ నినాదం బూమరాంగ్ అయింది, దాంతో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఇపుడు అమరావతి ఏకైక రాజధానిగా చురుకుగా పనులు సాగుతున్నాయి.అయితే జగన్ మళ్ళీ వస్తే అన్న చర్చ ఉందని కూటమి నేతలు అంటున్నారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీకి పెట్టుబడులు పెట్టడానికి చాలా మంది ఆసక్తిగా ఉన్నారు కానీ మళ్ళీ జగన్ వస్తేనో అన్న సందేహం వెలిబుచ్చుతున్నారని చెప్పేవారు. అయితే జగన్ అనే రాజకీయ భూతాన్ని తాను శాశ్వతంగా బంధించాను అని బాబు అంటున్నారు.విశాఖలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు ఇదే మాట చెప్పారు. జగన్ గురించి ఎవరూ భయపడాల్సింది లేదని ఆయన అన్నారు. జగన్ ఇక మళ్ళీ అధికారంలోకి రాదని కూడా ఆయన చెప్పుకొచ్చారు. అయితే జగన్ విషయంలో నిజంగా ఇన్వెస్టర్లు భయపడుతున్నారా లేక కూటమి నేతలు భయపడుతున్నారా అన్న కొత్త చర్చకు తెర లేస్తోంది.నిజానికి చూస్తే ఏపీలో ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. ఏపీని డెవలప్మెంట్ చేద్దామని కొంతమంది పెట్టుబడిదారులు వస్తున్నారు అని అయితే జగన్ మళ్ళీ ఏపీకి సీఎం అయితే తమ పరిస్థితి ఏంటని వారు చంద్రబాబుని అడుగుతున్నారుట. ఇదే విషయం చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. లేటెస్ట్ గా మళ్ళీ అదే చెప్పారు.ఇక జగన్ విషయం తీసుకుంటే ఏపీ రాజధాని విషయంలో వైసీపీ స్టాండ్ ఏంటి అన్నది ఇంకా చెప్పడం లేదని కూడా చర్చగా ఉంది. ఒకవేళ అమరావతిని చంద్రబాబు బాగా అభివృద్ధి చేస్తే కనుక మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే ఆయన ఏపీకి రాజధాని అమరావతి కాకుండా వైజాగ్ అంటే తమ పరిస్థితి ఏంటని ఇన్వెస్టర్లు చంద్రబాబుని అడుగుతున్నారుట.మరో వైపు చూస్తే కింది స్థాయిలో ఉన్న టీడీపీ కూటమి నేతలు అయితే దూకుడు పెద్దగా చేయడం లేదు, రాజకీయంగా వారు రెచ్చిపోవడం లేదు అని అంటున్నారు. ఎందుకంటే రేపు ఒకవేళ జగన్ వస్తే తమ పరిస్థితి ఏమిటి అన్నది ఒక అంచనా వేసుకునే వారు మిన్నకుంటున్నారు అని అంటున్నారు.అంతే కాదు ఈ మధ్య జగన్ ఒక మాట గట్టిగానే చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ నేతలు కానీ క్యాడర్ కానీ వేధింపులకు గురి అయితే మీకు నచ్చిన బుక్ లో బాధలు పెట్టిన వారి పేర్లను రాసుకుని ఉంచుకోండి అని సూచించారు. రేపటి రోజున వైసీపీ ప్రభుత్వం వస్తే కనుక కచ్చితంగా వారి మీద చర్యలు ఉంటాయని వారు ఏ దేశంలో ఉన్నా ఎక్కడ ఉన్నా తెచ్చి మరీ చేయాల్సింది చేస్తామని జగన్ సీరియస్ గానే వార్నింగ్ ఇచ్చారు.ఇలా జగన్ బిగ్ సౌండ్ చేసేసరికి కింది స్థాయిలో ఉన్న కూటమి నేతలు కానీ క్యాడర్ కానీ ఎందుకొచ్చిన బాధ అని కాస్తా నిదానించారు అని అంటున్నారు. ఎందుకంటే రాజకీయం ఎపుడూ ఒకేలా ఉండదని అంటున్నారు. రేపటి రోజున జగన్ కనుక వస్తే తమ పరిస్థితి ఏంటని వారు ఆందోళనతోనే ముందు జాగ్రత్తగా తగ్గుతున్నారని అంటున్నారు.అంతే కాదు గ్రౌండ్ లెవెల్ లో వైసీపీ వారితో కలిసి బిజినెస్ లు కూడా చాలా మంది చేసుకుంటున్నారు అని అంటున్నారు. ఈ విధంగా కలిసి ఉంటే కలదు సుఖం అన్న నీతిని బాగా ఫాలో అవుతూ బాగానే వ్యాపారాలు చేసుకుంటున్నారు అని అంటున్నారు.మరీ పై నుంచి గట్టిగా వస్తే తప్ప ఏవో కొన్ని సంఘటనలు తప్పించి దిగువ స్థాయిలో అయితే కూటమి నేతలు దేనికీ పెద్దగా రియాక్ట్ కావడం లేదు అని అంటున్నారు. మొత్తానికి చూస్తే జగన్ చేస్తున్న హెచ్చరికలు బాగానే పనిచేస్తున్నాయని అంటున్నారు. జగన్ దెబ్బకు భయపడుతున్నట్లుగానే గ్రౌండ్ లెవెల్ లో పరిస్థితి ఉందని అంటున్నారు.దీంతో ఇవన్నీ చూసిన మీదటనే చంద్రబాబు విశాఖలో జరిగిన కార్యకర్తల సమావేశంలో టీడీపీ ఎప్పటికీ ఓడిపోదు అని ఒక భారీ ప్రకటన చేసారు. జగన్ అనే రాజకీయ భూతాన్ని బంధించామని ఎవరికీ ఆ సమస్య అన్నది లేనే లేదని చెప్పారు. అయితే సీఎం బాబు ఎంత చెప్పినా కూడా క్యాడర్ మాత్రం వాస్తవాలు గ్రహించి దానికి తగినట్లుగా తెలివిడిగానే వ్యవహరిస్తోంది అని అంటున్నారు.దీంతో జగన్ అంటే కూటమి నేతలకు భయం పట్టుకుందా ఇన్వెస్టర్లు పేరు బయటకు చెబుతున్నా అసలు వాస్తవాలు రాజకీయ కారణాలేనా అన్న చర్చ సాగుతోంది. సో టోటల్ గా చూస్తే రాజకీయాలు పూర్వం మాదిరిగా లేవు. అందుకే ఇపుడు ఎవరికి వారు తమ క్షేమం చూసుకుంటున్నారు అని అంటున్నారు. అదన్న మాట మ్యాటర్.

# నేతల పోస్ట్ ఊస్ట్.. కారణాలు ఇవేనా?

హైదరాబాద్, అత్యంత సీనియర్ లీడర్లు వాళ్లు.. ఒకే జిల్లాకు చెందిన ఆ ఇద్దరు కీలక నేతలకు మంత్రి పదవులతో పాటు.. జిల్లా ఇంచార్జ్ పదవులు కూడా దక్కాయి. కానీ ఏం జరిగిందో ఏంటో తెలియదు.. సడెన్‌గా వారి ఇంచార్జ్ పదవులు ఊడాయి. దీనికి కారాణాలేంటన్న దానిపై అధిష్టానం క్లారిటీ ఇవ్వలేదు.. నేతలు నోరు మెదపడం లేదు. ఇంతకీ వారి తొలగింపు వెనకున్న రీజన్స్ ఏంటి? ఎవరా ఇద్దరు సీనియర్ నేతలు?

పది ఉమ్మడి జిల్లాలకు ఇంచార్జ్‌లుగా పది మంది మంత్రులు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన విధానంలో చాలా మార్పులు తీసుకొచ్చింది. అందులో ఒకటి జిల్లాలకు ఇంఛార్జ్ మంత్రులను నియమించడం. మొత్తం పది ఉమ్మడి జిల్లాలకు పది మంది మంత్రులకు ఇంచార్జ్ మంత్రిగా బాధ్యతలను సీఎం రేవంత్ రెడ్డి అప్పగించారు. లేటెస్ట్‌గా ముగ్గురు మంత్రులు క్యాబినెట్‌లోకి రావడంతో.. పాత వారిలో ముగ్గురు మంత్రులకు ఇంచార్జ్ బాధ్యతల నుంచి పక్కన పెట్టారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖను ఏ జిల్లాకు ఇంచార్జ్‌గా నియమించలేదు. ఇదే ఇప్పుడు అనేక అనుమానాలకు, రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెర లేపింది.

ప్రతి కీలకమైన పనికి ఇంచార్జ్ మంత్రి ఆమోదం

ఈ ఏడాదిన్నర కాలంగా ఇంచార్జ్ మంత్రి ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గ డెవలప్ మెంట్ ఫండ్స్ కూడా ఇంచార్జ్ మంత్రి కనుసన్నల్లోనే రిలీజ్ చేస్తున్నారు. ఇలా ప్రతీ కీలకమైన పనికి ఇంచార్జ్ మంత్రి ఆమోదం ఉంటుండటంతో..ఆ పోస్ట్‌కు ఫుల్ ప్రియారిటీ పెరిగిందనే చెప్పాలి. అందుకే ముగ్గురు మంత్రులకు ఏ జిల్లా బాధ్యతలు ఇవ్వకుండా ఎందుకు పక్కన పెట్టారనేది పొలిటికల్ సర్కిల్స్‌లో సీరియస్ డిస్కషన్స్ మొదలయ్యాయి.

సీఎం స్థానానికి సైతం పోటీపడిన ఉత్తమ్, కోమటిరెడ్డి

తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవి త్యాగం చేసి మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే మంత్రిగా బాధ్యతలు చేపడతానన్నారు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అదే మాట నిజమైంది కూడా. ఇక పీసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఆ తరువాత రేవంత్ రెడ్డికి పీసీసీ బాధ్యతలు అప్పగించారు. ఒక దశలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రి స్థానానికి పోటి పడిన వ్యక్తులు. సీఎం రేవంత్ రెడ్డి కేబినేట్‌లో కీలకశాఖలో మంత్రులుగా కొనసాగుతున్నారు ఈ ఇద్దరు నేతలు. కరీంనగర్ ఇంచార్జ్ మంత్రిగా ఉత్తమ్, ఖమ్మం జిల్లా ఇంచార్జ్‌గా కోమటిరెడ్డి కొనసాగుతూ వచ్చారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి వీరవిధేయులుగా ఉన్న వీరిని ఇంచార్జ్ మంత్రులుగా నియమించడం అదనపు గౌరవం లాంటిది. కానీ ఒక్కసారిగా ఇద్దరు ఇంచార్జ్‌లను తొలిగించడం అందరిని ఆశ్చర్యపరిచింది.

ఉమ్మడి ఏపీలోని ఇంచార్జ్‌గా కొనసాగిన కోమటిరెడ్డి



ఇంచార్జ్ మంత్రులుగా పని చేయడం ఈ ఇద్దరు నేతలకు కొత్తేమి కాదు. ఉమ్మడి ఏపీలోను కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంచార్జ్ మంత్రిగా పని చేశారు. అధిష్టానం వద్ద వీర విధేయుడిగా ఉన్న ఉత్తమ్ నుంచి ఇప్పటికీ కీలక విషయాల్లోనూ సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకుంటారు. అలాంటి సీనియర్ మంత్రులను పక్కనపెట్టి మొదటిసారి ఎమ్మెల్యే అయ్యి మంత్రి అయిన వారికి ఇంచార్జ్ మంత్రులు కట్టపెట్టింది అదిష్టానం. సీనియర్లను.. అందులోనూ నల్లగొండ జిల్లా వారినే పక్కన పెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

తొలగింపుపై స్పందించని అధిష్టానం, మంత్రులు

అసలు ఈ ఇద్దరిని పక్కన పెట్టడానికి కారణమేంటనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. ఈ అంశంపై అటు అధిష్టానం.. ఇటు మంత్రులు.. ఎవ్వరు స్పందించలేదు. చాలా వరకు పని ఒత్తిడి కారణంగా పక్కన పెట్టారనే చర్చ కొనసాగుతోంది. కానీ అందులో వాస్తవం లేదని తెలుస్తోంది. నిజంగా పని ఒత్తిడే కారణమైతే ఇప్పటివరకు మంత్రులు ఎప్పుడో బయట చెప్పేవారు. కాని ఎందుకు తొలిగించారో వారికి కూడా తెలియని పరిస్థితి అనే టాక్ వినిపిస్తోంది. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పని ఒత్తిడి ఉందనుకుందాం. కానీ మంత్రి కోమటిరెడ్డి సంగతేంటనే ప్రశ్న తెరపైకి వస్తోంది.

అదనంగా మరో జిల్లాకు ఇంచార్జ్‌గా నియమించినా పనిచేస్తాననే కోమటి రెడ్డి

ఎందుకంటే కోమటిరెడ్డి పాలిటిక్స్‌లో ఫుల్ యాక్టివ్‌గా ఉంటారు. ఉన్న జిల్లాతో పాటు.. అదనంగా మరో జిల్లాకు ఇంచార్జ్ మంత్రిగా కేటాయించిన బాధ్యతలు నిర్వహిస్తానని చెప్తారు. అలాంటి నేతకు పని ఒత్తిడి అనే కారణం చెప్పి పక్కన పెట్టే సీన్ అయితే కనిపించడం లేదు. మంత్రి ఉత్తమ్ కూడా పని ఒత్తిడే కారణంగానే తొలిగిస్తే ఈ పాటికి ఎప్పుడో ప్రకటన చేసేవారు. కారణం ఏదైనా వారిని తొలగించడంతో ఈ ఇద్దరు సీనియర్ నేతలు పైకి మాట్లాడకున్నా.. లోపల మాత్రం రగిలిపోతున్నారని తెలుస్తోంది. మరి అధిష్టానం దీనిపై ఏమైనా ప్రకటన చేస్తుందా లేక వీరే ఎక్కడైనా బ్లాస్ట్ అవుతారా? అనేది చూడాలి.

# నాగబాబా లేక బాల శౌరీనా ?



అమరావతి,ఈ ఏడాది వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి మొదలు కాబోతున్నాయి. అవి ఆగస్టు రెండో వారం దాకా కొనసాగనున్నాయి. ఆ తరువాత స్వతంత్ర దినోత్సవం వేడుక చూసుకుని కేంద్ర మంత్రి వర్గాన్ని విస్తరించేందుకు మార్పులు చేర్పులు చేసేందుకు ముహూర్తం నిర్ణయించారని అంటున్నారు.అంటే ఆగస్టు మూడవ వారంలో కేంద్ర మంత్రి వర్గంలో భారీ మార్పులు ఉంటాయని ఢిల్లీ వర్గాల భోగట్టా. ఈసారి మంత్రివర్గ విస్తరణలో వచ్చే ఏడాది దేశంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ప్రాధాన్యత ఇస్తూ అక్కడ కొత్త వారిని తీసుకుంటారు అని అంటున్నారు. అలా తమిళనాడు నుంచి అక్కడ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలైకి చాన్స్ కచ్చితంగా ఉంటుందని చెబుతున్నారు. అలా పశ్చిమ బెంగాల్ నుంచి కూడా బలమైన నేతలు ఒకరిద్దరికి చాన్స్ ఉంటుందని చెబుతున్నారు.ఈ క్రమంలో ఏపీ నుంచి ఒకరికి మంత్రి పదవి ఇస్తారని అంటున్నారు. ఆ కోటా జనసేనదే అని చెబుతున్నారు. ఏపీ నుంచి టీడీపీ బీజేపీకి కేంద్ర మంత్రివర్గంలో స్థానం ఉంది. అయితే జనసేనకు మాత్రం అవకాశం దక్కలేదు. నిజానికి గత ఏడాది జూన్ 9న మూడవసారి మోడీ ప్రభుత్వం కొలువు తీరినపుడే జనసేనను అడిగారని కూడా చెప్పుకున్నారు. అయితే నాగబాబుని దృష్టిలో ఉంచుకుని తర్వాత చూద్దామని ఆ పార్టీ అధినాయకత్వం చెప్పిందని ప్రచారం సాగింది.అలా కేంద్ర మంత్రివర్గంలో మార్పులు ఎపుడు జరిగినా జనసేనకు ఒక మంత్రి పదవి రిజర్వు అయిపోయింది అని అంతా చెప్పుకున్నారు. కానీ అనూహ్యంగా నాగబాబు రాజ్యసభకు కాకుండా ఎమ్మెల్సీ అయ్యారు. ఆయనకు ఏపీ కేబినెట్ లో మంత్రి పదవి ఇస్తారని కూడా ప్రచారం సాగుతోంది. అయితే అది ఇప్పటి దాకా జరగలేదు.దాంతో పాటు కేంద్ర మంత్రి వర్గ విస్తరణ అన్నది ఇపుడు ముందుకు రావడంతో నాగబాబుని కేంద్రంలోనికి తీసుకుంటారా అన్న చర్చ మొదలైంది. నాగబాబు ఎమ్మెల్సీ పదవిని వదులుకుని రాజ్యసభ ద్వారా ఎన్నికై కేంద్ర కేబినెట్లోకి వెళ్ళేందుకు వీలుంది. అయితే ఏపీలో చూస్తే 2026 జూన్ దాకా రాజ్యసభ ఖాళీలు లేవు.దాంతో ఏమి చేస్తారు అన్నదే ఇపుడు చర్చగా ఉంది. ఇక చూస్తే కనుక జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. వారిలో ఒకరు మచిలీపట్నం ఎంపీగా ఉన్న వల్లభనేని బాలశౌరి. ఆయన సీనియర్ మోస్ట్ నేత. ఆయన కాంగ్రెస్ నుంచి రెండు సార్లు ఎంపీ అయ్యారు. అలాగే వైసీపీ నుంచి ఒకసారి జనసేన నుంచి ఒకసారి గెలిచారు. ఆయనకు కేంద్ర మంత్రి అయ్యేందుకు అన్ని రకాలుగా అర్హత ఉంది.దాంతో ఆయన పేరుని జనసేన అధినాయకత్వం ప్రకటిస్తుందా అన్నదే ఇపుడు చర్చగా ఉంది. అలా కాదు నాగబాబుని జాతీయ స్థాయిలో కీలకం చేయాలి అనుకుంటే ఆయన పేరుని చెబుతారు. మరో ఏడాదికి కానీ ఆయన రాజ్యసభ మెంబర్ కాలేరు. దాంతో ఆగస్టులో జరిగే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో జనసేనకు చోటు ఉంటే అది తప్పకుండా బాలశౌరికే వెళ్తుంది అని అంటున్నారు.అయితే ఇక్కడో అవకాశం ఉంది. మరోసారి జరిగే మంత్రి వర్గ విస్తరణలో జనసేన కేంద్ర కేబినెట్ లో చేరుతుందని చెప్పి ఇపుడు బెర్త్ ని కాదనుకోవడం. అలా భవిష్యత్తు అవకాశాల కోసం అట్టేబెట్టుకోవడం. ఎటూ కళ్ళు మూసుకుంటే ఏడాది ఇట్టే తిరిగిపోతుంది. దాంతో ముందు రాజ్యసభ ఎంపీగా నాగబాబు నెగ్గితే మరోసారి జరిగే విస్తరణలో

# అంతర్జాతీయ సర్వీసుల విషయంలో ఎయిరిండియా కీలక నిర్ణయం!



న్యూఢిల్లీ,జూన్ 12 అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదం అనంతరం ఎయిరిండియా నిత్యం వార్తలో నిలుస్తోన్న సంగతి తెలిసిందే! ఈ క్రమంలో తాజాగా ఎయిరిండియా ఓ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా.. వైడ్-బాడీ విమానాలపై అంతర్జాతీయ సేవలను 15% తగ్గించనుందది. ఈ మేరకు సౌరభ్ సిన్హా నివేదించారు.అవును... ఎయిరిండియా వైడ్ బాడీ విమానాలపై అంతర్జాతీయ సేవలను 15% తగ్గించనుందని.. ఇది జూలై మధ్య కాలం వరకూ తక్షణమే అమలులోకి వస్తుందని సౌరభ్ సిన్హా నివేదించారు. వైడ్ బాడీ బోయింగ్ విమానాల్లో మరింతగా రక్షణ తనిఖీలు చేపట్టనున్నామని.. అదనపు జాగ్రత్తల కోసం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఎయిరిండియా తెలిపింది.ఈ తగ్గింపు కారణంగా ఎఫెక్ట్ అవుతున్న ప్రయాణికులకు ఎయిరిండియా క్షమాపణలు చెబుతోంది. ఈ సందర్భంగా.. ప్రయాణికులు ఎలాంటి ఖర్చు లేకుండా వారి ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేసుకునే లేదా డబ్బులు వాపస్ తీసుకునే అవకాశాన్ని కూడా అందిస్తున్నట్లు తెలిపింది. ఈ కొత్త షెడ్యూల్ జూన్ 20 - 2025 నుంచి అమల్లోకి రానుందని వివరించింది!ప్రధానంగా కార్యాచరణ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, ప్రయాణికులకు చివరి నిమిషంలో కలిగే అసౌకర్యాన్ని తగ్గించడానికి ఇది జరుగుతుందని.. ప్రయాణికులు, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, భారతదేశ మద్దతుతో తాము ఆ విషాద సంఘటన నుంచి మరింత బలంగా బయటపడతామని.. ప్రయాణికులకు తమ సేవల్లో విశ్వాసాన్ని తిరిగి స్థాపించగలమని పేర్కొంది.కాగా... ఇటీవల ఎయిరిండియా బోయింగ్ 787-8/9 విమానాలలో మెరుగైన భద్రతా తనిఖీని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మొత్తం 33 విమానాలలోనూ ఇప్పటికే 26 విమానాల తనిఖీలు పూర్తయ్యాయని ఎయిరిండియా తెలిపింది. మిగిలినవి త్వరలో పూర్తవుతాయని వెల్లడించింది.

## పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన: సీఎం చంద్రబాబు

అమరావతి,పన్నుల వసూళ్లలో అవగాహన కల్పించాలని, వేధింపులకు పాల్పడవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. పన్నులను సకాలంలో వసూలు చేయాల్సిందేనని అయితే ప్రజలపై ఒత్తిడి తేవద్దన్నారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. వ్యవస్థలో లొసుగులు వాడుకొని రెవెన్యూకు గండి కొడితే కఠిన

# అగ్రరాజ్యం వితండవాదం.. భారత్ ఎప్పుడూ ఆరో వేలే!

న్యూఢిల్లీ,ఇజ్రాయెల్ - ఇరాన్ పంచాయితీ తెలిసిందే. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేసుకుంటుందని.. అది ప్రపంచానికి ప్రమాదకరమన్నది ఇజ్రాయెల్.. అమెరికా వాదన. ఇందులో నిజమెంత? అబద్ధమెంత? అన్నది చర్చ కానే కాదు. ఇరాన్ చేతికి అణ్వాయుధం చిక్కితే.. ప్రపంచం మీద పడే ప్రభావాన్ని అంచనా వేసి.. ఆగమాగం అవుతున్న అగ్రరాజ్యం అమెరికా.. పాకిస్థాన్ ను ఎందుకు నిలువరించలేదు? అన్నది ప్రశ్న.అమెరికా చరిత్రలో అత్యంత ఘోర విషాదంగా ట్విన్ టవర్స్ పై ఉగ్రదాడిని చెప్పుకోవచ్చు. ఈ దారుణ ఉదంతంలో వందలాది అమెరికన్ల ప్రాణాలు పోవటం తెలిసిందే. అందుకు ప్లాన్ చేసిన బిన్ లాడెన్ ఆశ్రయం పొందింది ఎక్కడ? పాకిస్థాన్ లో. పాక్ కు తెలీకుండానే లాడెన్ పాక్ లో మనుగడ సాగించగలడా? అన్న ప్రశ్నకు చిన్న పిల్లాడు సైతం సమాధానం చెప్పేస్తాడు. అలాంటప్పుడు అన్ని తెలిసిన అగ్రరాజ్యం ఏమీ తెలీనట్లు ఎందుకు ఉంది?లాడెన్ ను పాక్ గగనతలంలోకి వెళ్లి వైమానిక దాడులు చేపట్టి హతమార్చటం తెలిసిందే. అయితే.. పాక్ మీద ఎందుకు ఆగ్రహాన్ని వ్యక్తం చేయలేదు? మా దేశస్తుల ప్రాణాలు తీసినోళ్లకు ఆశ్రయం కల్పిస్తావా? అంటూ ఎందుకు రంకెలు వేయలేదు? కన్నెర్ర చేయకపోవటం ఏమిటి? ఆంక్షల కత్తిని దూసి పాక్ ను ఆగమాగం ఎందుకు చేయలేదు? లాంటి ప్రశ్నలు వేసుకుంటే.. పాక్ విషయంలో అన్ కండీషనల్ లవ్ ను ప్రదర్శించే అమెరికా.. భారత్ విషయానికి వచ్చినప్పుడు మాత్రం కండీషన్లతో కూడిన అభిమానాన్ని.. ప్రేమను ప్రదర్శిస్తుందన్నది నిజం.ప్రపంచ ఉగ్ర మూలాలు వెతికితే అందులో పాక్ జాడలు ఇట్టే కనిపిస్తాయి. అంతలా ఉగ్రభూతాన్ని పెంచి పోషించే పాక్ ను అమెరికా ఎందుకు చూసి చూడనట్లు వ్యవహరిస్తుంది. ఎంత వ్యూహాత్మక భాగస్వామి అయినా.. భారత్ తో పోలిస్తే పాక్ ను విశ్వసించలేకున్నా.. పాక్ వైపు మొగ్గు చూపే అగ్రరాజ్యం తీరును చూస్తే.. దాని డబుల్ టంగ్ ఇట్టే అర్థమవుతుంది.



నాగరిక ప్రపంచంలో ఎవరు ఎవరి మీదా అజమాయిషీ ప్రదర్శించకూడదని అనుకున్నా.. అగ్రరాజ్యం మాత్రం ఎప్పుడూ తన ఇష్టానికి తగ్గట్లే ప్రపంచం ఉండాలన్నట్లు వ్యవహరించటం చూస్తున్నాం.తనకు నచ్చిన దివంగత ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ను ఏం చేశారో ప్రపంచానికి తెలిసిందే. ఎంత సంపన్న దేశమైతే మాత్రం ప్రపంచం మీద ఇంత పెత్తనమా? అన్న ప్రశ్న మనసును తొలిచేస్తూ ఉంటుంది. ఇరాన్ విషయంలో నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు.. పాక్ విషయంలో మాత్రం ఎక్కడలేని అభిమానాన్ని ప్రదర్శించటం చూస్తే..దాని డబుల్ స్టాండర్స్ ఇట్టే అర్థమవుతాయి. ఇజ్రాయెల్ - ఇరాన్ ఉద్రిక్తతల వేళ పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ కు విందు ఏర్పాటు చేయటం.. అందులో ట్రంప్ పాల్గొనటం చూసినప్పుడు.. కుట్రలు.. కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచే పాక్ విషయంలో అమెరికా ప్రదర్శించే అభిమానం చూసినప్పుడు అగ్రరాజ్యం పక్షపాతం మరోసారి కళ్లకు కట్టినట్లుగా కనిపించకమానదు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com